
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 26-7-2024 15/-




## ఎమర్జన్సీ రాజకీయం

విదేశీ ముద్ర వేయడం
కుదరదన్న కోర్టు



బహుదైవారాధన...
వ్యభిచారం
మహా పాపాలు



సహజీవన భావాల సౌభ్రాతృ
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 30 హైదరాబాద్
శుక్రవారం 26 జులై 2024 రూ.15-00
19 ముహర్రమ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**ప్రళయదినాన
మీరు మీ పేరుతోనూ,
మీ తండ్రుల పేరుతోనూ
పిలువబడతారు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





14

**సమాజ నిర్మాణంలో నైతిక విలువలు**

## లోపల...


| | | |
|---|---|---|
| ఎమర్జన్సీ రాజకీయాలు | ...... | 04 |
| మతతత్వం | ...... | 05 |
| ప్రేమారాధన శ్రేష్ఠుడు – 39 | ...... | 08 |
| బరువుల్ని ఎత్తుకోండి! భారంగా మారకండి!! – 2 | ...... | 11 |
| ఆరోగ్యమే అసలైన ఆస్తి | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు–2 : కెప్టెన్ ముహమ్మద్ అక్రం | ...... | 21 |
| విశ్వాస పరిమళమద్దిన ఖాజావలి పద్యకావ్యం "అల్లాహ్ సందేశం" | ...... | 22 |
| పూలపాన్పు | ...... | 25 |
| విదేశీముద్ర వేయడం కుదరదన్న కోర్టు | ...... | 26 |
| బహుదైవారాధన... వ్యభిచారం మహాపాపాలు | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే సత్కార్యాలన్నీ వృధా అవుతాయి | ...... | 34 |


**బెల్లమున్నచోటే ఈగలు**




కారులోంచి హస్తానికి
సాగుతున్న వలసలు
కారుఖాళీ ఔతోందని
వస్తున్నై గుసగుసలు!
బెల్లం ఎక్కడ వుంటే
ఈగల గుంపు అక్కడే
కడుపు నిండాలంటే
ఏదో ఒకటి బుక్కడే!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# మతతత్వం

**భారతదేశంలో** 2014లో ప్రారంభమైన కథ 2024లో ముగింపు దశకు చేరుకుంది. మతతత్వరాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టే కథ ఇది. ఈ రాజకీయాలను ప్రజలు తిరస్కరించకపోతే ఈ సారి బీజేపీ కోరుకున్నట్లు 400 స్థానాలు ఇచ్చి ఉండేవారే. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో మాంసం, మచిలి, మంగళసూత్రం అంటూ బాహాటంగా ప్రధాని స్వయంగా ఇస్లామోఫోబిక్ ప్రచారం చేసిన ప్రాంతాల్లో కూడా బీజేపీ పరాజయం పాలయ్యింది. అయోధ్యలోనే బీజేపీ ఓటమి దీనికి ఒక నిదర్శనం. కాని ఈ పరాజయంతో పాఠాలు నేర్చుకున్నట్లు కనబడడం లేదు. ఈ రాజకీయాలే ఎల్లప్పుడు నడపగలమని భావిస్తున్నట్లు కనబడుతున్నారు.

మహారాష్ట్ర కొల్హాపూర్‌లో ఇప్పుడు ఏం జరిగింది? మధ్యప్రదేశ్‌లో ఏం జరిగింది? గమనిస్తే గత పదేళ్ళుగా నడుపుతున్న రాజకీయాలే మరోసారి కొనసాగిస్తున్నట్లు కనబడుతోంది. గుంపుదాడులు కొనసాగుతున్నాయి. ఇవే దాడులు గత పదేళ్ళుగా మూకహత్యల్లోను కనిపించాయి. మతతత్వ హింసాకాండతో మహారాష్ట్ర ఎన్నికల ప్రచారాన్ని మతతత్వపార్టీలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. చలో విశాల్ గఢ్ అంటూ విధ్వంసానికి పాల్పడ్డారు. ఇందులో ఒక మస్జిదుపై కూడా దాడి జరిగింది. మస్జిదును ధ్వంసం చేసి దానిపై కాషాయ జెండా ఎగరేసారు. ఈ సంఘటనతో పాటు మహారాష్ట్రలో మతపరమైన ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఓటు రాజకీయాలు గతంలో మతతత్వ పార్టీలకు చాలా ప్రయోజనాలిచ్చాయి.

అలాగే మధ్యప్రదేశ్‌లో చాలా కాలంగా ఒక వివాదం ఉంది. ఈ వివాదంపై ఇప్పుడు ఆర్కియాలజికల్ సర్వే రిపోర్టు ఎలా వచ్చిందంటే, ధార్ జిల్లాలోని కమలా మౌలా మస్జిదు భోజశాల మందిర శిధిలాలపై కట్టారని చెప్పింది. అయితే ఈ మస్జిదులు మందిరాల శిధిలాలపై చాలా శతాబ్దాల తర్వాత కట్టినవి. ఇక ఇప్పుడు మతతత్వ శక్తులకు కొత్త ఆయుధం దొరికినట్లయ్యింది. ఇప్పటి వరకు కాశీ మధుర బాకీ హై అనేవారు. ఇప్పుడు మరో వివాదం సృష్టించి ప్రజల్లో చిచ్చుపెట్టే అవకాశం దొరికింది.


త్వరలో అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ఇప్పుడు ఈ కొల్హాపూర్ విశాల్‌గఢ్‌లో వివాదం, ధార్‌లో వివాదం ఆధారం చేసుకుని మతతత్వాన్ని రెచ్చగొడతాయి. కొల్హాపూర్‌లో ఈ రాజకీయాలను రాజ్యసభ ఎం.పి.గా ఉన్న సంభాజీ స్వయంగా నడుపుతున్నాడు. ఇదంతా దురాక్రమణలు తొలగించే పేరుతో జరుగుతోంది. దురాక్రమణలు తొలగించే పేరుతో బుల్డోజర్లు నడపడం కూడా ఇప్పుడు ఎక్కువయ్యింది. ఇప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని గుండాగిరి చెలాయించే ఇలాంటి సంఘటనలు మరిన్ని మన ముందుకు రావచ్చు. మాకు ఓటు వేయని వారి పనులు మేం చేసేది లేదని ప్రకటించిన నేతలు ఏ పార్టీల వారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విచిత్రమేమిటంటే వందలాది మంది గుంపు ఇక్కడికి వచ్చి దాడులు చేస్తూ విధ్వంసం చేస్తున్నప్పుడే పాలనాయంత్రాంగానికి ఎంత తీరుబడి లభించిందంటే గత అనేక దశాబ్దాలుగా గుర్తుకు రాని ఇల్లీగల్ కట్టడాలను కూలగొట్టాలన్న విషయం గుర్తుకు వచ్చి, ఆ పనిలో దిగారు. చట్టవిరుద్ధంగా ఉన్నాయని అనేక దుకాణాలు, ఇండ్లను కూలగొట్టారు.

లోక్ సభ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెసు నాయకత్వంలోని ఇండియా కూటమి విజయం సాధించింది. పశ్చిమ మహారాష్ట్రలో ఒకప్పుడు కాంగ్రెసు బలంగా ఉండేది. 2014 తర్వాత ఇక్కడ బీజేపీ బలపడింది. కాని ఈ సారి ఎన్నికల్లో ఇక్కడి 7 లోక్‌సభ స్థానాల్లో 5 చోట్ల బీజేపీ ఓడిపోయింది. దీనికి కారణం హిందూముస్లిముల ఐక్యత. కాని ఇప్పుడు ఈ ఐక్యతను ధ్వంసం చేస్తూ మతతత్వ చిచ్చు పెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రయత్నాల వెనుక ఉన్నది సంభాజీ మహరాజ్ అనబడే నేత. ఈయన సాహూ మహరాజ్ వంశీకుడు. కాని దివ్యఖుర్‌ఆన్‌ను మరాఠీలో అనువదించిన వారు. ఆయన అంబేద్కర్‌కు స్కాలర్‌షిప్ ఇచ్చారు. దళితులకు రిజర్వేషన్లు ప్రారంభించింది ఆయనే. అలాంటి సాహూ మహరాజ్ వంశీకుడైన సంభాజీ మహరాజ్ ఇప్పుడు కొల్హాపూర్‌లో ఇవన్నీ చేయించాడు. ఇదంతా హిందూ ముస్లిం ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నంగా చాలా మంది చూస్తున్నారు. పైగా ఇదంతా జరుగుతున్నప్పుడే ఏకనాథ్ షిండే ప్రభుత్వం దుకాణాలు, ఇండ్ల కూల్చివేత చేయించి హిందూత్వ శక్తులకు ఊతమిచ్చింది. ఇదంతా ఇక్కడి సామరస్యపూర్వక వాతావరణాన్ని నాశనం చేయడానికి పథకం ప్రకారం జరుగుతున్న మతతత్వ రాజకీయాల ప్రయత్నంగా చాలా మంది చూస్తున్నారు. ఎందుకంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో దాదాపు 30 నుంచి 40 స్థానాలు బీజేపీ చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పుడు ఈ హింసాత్మక రాజకీయాలు మొదలయ్యాయి. ప్రజల్లో చిచ్చు పెట్టి గెలిచే ప్రయత్నాలు.

బీజేపీ అగ్రనేతలు దేశాన్ని అభివృద్ధి పరుగులు పెట్టిస్తామంటారు. కాని ఎప్పుడు గత శతాబ్దాల్లో జరిగిన సంఘటనల చుట్టు రాజకీయాలు నడుపుతుంటారు. కొల్హాపూర్ లో 17వ శతాబ్దానికి చెందిన కోట గురించి వివాదం. అలాగే మధ్యప్రదేశ్‌లో గుజరాత్ గోధ్రా తర్వాతి నుంచి ఈ రాజకీయాలే దేశంలో నడుస్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లో 14వ శతాబ్దానికి చెందిన వివాదం. 1991 చట్టం ప్రకారం ఆరాధనా ప్రదేశాలు 1947లో ఏ స్థితిలో ఉన్నాయో అలాగే ఉండాలని వాటిని మార్చరాదని చెబుతుంది. కాని ఆర్కియాలాజికల్ సర్వే ఒక రిపోర్టు ఇవ్వగానే ధార్ జిల్లాలో కమల్ మౌలా మస్జిదు వివాదాన్ని ప్రారంభించారు. అయోధ్యలో ఓడిపోయారు. కాశీ మధురలు ఎలాగూ ఇంకా ఉన్నాయి. వాటితో పాటు ఇప్పుడు ఈ కొత్త వివాదం కూడా రాజేస్తే రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవచ్చనే ఆలోచన కనిపిస్తుంది. ఈ మొత్తం రాజకీయాలు క్లుప్తంగా హిందువులకు వారి మతం ప్రమాదంలో ఉందని భయపెడుతుంటాయి. ముస్లిములకు వారి భద్రత ప్రమాదంలో ఉందని భయపెడుతుంటాయి. ఇదంతా భయం చుట్టు అల్లుకున్న రాజకీయం. ఈ రాజకీయాలను చూస్తున్నప్పుడు రాహుల్ గాంధీ చెప్పిన 'భయపడకండి, భయపెట్టకండి' నినాదం మరీ మరీ గుర్తొస్తుంది. ✤

అబ్దుల్ వాహెద్




# ఎమర్జన్సీ రాజకీయం

**అబ్ కహా ఢూండనే జావోగే మేరే ఖాతిల్**
**ఆప్‌తో ఖత్ల్ కా ఇల్జామ్ హమీ పర్ రఖ్ దో**

**నా హంతకుడా! ఇప్పుడు ఎక్కడని వెదుకుతావు**
**నా హత్యారోపణ నాపైనే వేసేయ్**

రాహత్ ఇందోరీ రాసిన ఈ కవిత ఇప్పుడు చాలా గుర్తొస్తుంది. ఎందుకు గుర్తొస్తుందో తర్వాత చెబుతాను.

సంవిధాన్ హత్యా దివస్ ... దీన్ని తెలుగులో ఎలా అనువదించాలి?

"రాజ్యాంగ హత్యాదినం" అని అనువదిస్తే సరిపోతుందనుకుంటాను. ఈ అనువాదంలో తప్పుంటే మన్నించాలి. ఇప్పుడు ప్రభుత్వం సంవిధాన్ హత్యా దివస్ జరుపుకోవాలని ప్రకటించింది. అత్యవసర పరిస్థితి కాలం నాటి జ్ఞాపకాలను ప్రతి సంవత్సరం దేశప్రజలందరు గుర్తు చేసుకోవాలని బీజేపీ కోరుతోంది. అందుకోసం జూన్ 25వ తేదీ సంవిధాన్ హత్యా దివస్‌గా ప్రకటించారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి నిర్వహిస్తుందన్నమాట. దీనికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ ప్రకటన విడుదల చేసింది. ప్రధాని, హోంమంత్రి, బీజేపీ మంత్రులు ఈ ట్వీట్లు చేస్తున్నారు. సంవిధాన్ హత్యా దివస్ అనే వాక్యాన్ని హిందీలోనే రాశారు కాని ఇంగ్లీషు అనువాదం ఎవరూ రాసినట్లు కనిపించలేదు. కొన్ని పత్రికల్లో "ది డే ఆఫ్ కానిస్టిట్యూషన్ మర్డర్డ్" అని కానిస్టిట్యూషన్ మర్డర్ డే అని రాశారు.

ఇందులో హత్య అనే పదం వాడడం విచిత్రంగా ఉంది. ఈ పదం నేరానికి, నేరపరిణామాలకు, నేరశిక్షాస్మృతికి సంబంధించిన పదం. హత్యలో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. మృతదేహం ఉంటుంది. ఎప్పుడో 50 సంవత్సరాల క్రితం హత్య జరిగిన తర్వాత ఈ యాభై సంవత్సరాలు రాజ్యాంగం సజీవంగా ఉందా? లేదా? లాంటి అనేక ప్రశ్నలు పుడతాయి. హత్య అనే బదులు కనీసం హత్యాయత్నం అని చెప్పినా బాగుండేదేమో...

నిజానికి 1975 జూన్ 25న ఎమర్జన్సీ విధించడం జరిగింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో యాభై సంవత్సరాల క్రితం ఎమర్జన్సీ విధించిన తేదీ అది. ఎమర్జన్సీ విధించడం అన్నది రాజ్యాంగంపై దాడి చేసి చంపడమా? ఎమర్జన్సీ ఎవరిపై దాడి చేసింది? ఎందుకంటే

ఎమర్జన్సీ కూడా రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే విధించారు. అంటే రాజ్యాంగం స్వయంగా తన హత్యకు ఆయుధాలు తానే ఇచ్చిందని అనుకోవాలా?

అందుకే రాహత్ ఇందోరీ కవిత గుర్తొచ్చింది. హతుడెవరో, హంతకుడెవరో అన్నీ గజిబిజి ప్రశ్నలే.

ఎమర్జన్సీ విధించడం వల్ల రాజ్యాంగంపై దాడి జరిగిందా? రాజ్యాంగంలోని నిబంధన ప్రకారమే కదా ఎమర్జన్సీ విధించారు. జుట్టుపీక్కున్నా అర్థం కాని చిక్కుముడి ఇది.

అసలు ఎమర్జన్సీ విధించడం వల్ల దాడి ఎవరిపై జరిగింది అని ఆలోచిస్తే ముఖ్యంగా దాడి ప్రాథమిక హక్కులపై, స్వేచ్ఛలపై జరిగింది. రాజ్యాంగంలోని అధికరణ 19 క్రింద ఇవ్వబడిన ప్రాథమిక హక్కులు ఎమర్జన్సీ ప్రకటన తర్వాత సస్పెండైపోతాయి. ఈ హక్కులేమిటంటే భావప్రకటనా స్వేచ్ఛ, నిరాయుధులుగా సమావేశమయ్యే స్వేచ్ఛ, సంఘాలు, సంస్థలు పెట్టుకునే స్వేచ్ఛ, దేశంలో ఎక్కడికైనా స్వేచ్ఛగా తిరిగే స్వేచ్ఛ, దేశంలో ఎక్కడైనా స్థిరపడి నివసించే స్వేచ్ఛ, ఏ వృత్తినైనా, ఏ వ్యాపారమైనా చేసుకునే స్వేచ్ఛ మొదలైనవి ప్రాథమిక హక్కులు. ఇవన్నీ ఎమర్జన్సీ కాలంలో హరించబడ్డాయి. అనేకమందిని జైళ్ళలో పెట్టడం జరిగింది. అది ఒక చీకటి అధ్యాయం. కాని అది రాజ్యాంగంలోని నిబంధన ప్రకారమే జరిగిందన్నది మరిచిపోరాదు. జర్మనీలో హిట్లర్ వంటి వాడు కూడా ప్రజాస్వామికంగానే అధికారంలోకి వచ్చాడన్నది ఎంత నిజమో ఇది కూడా అంతే నిజం.

ఎమర్జన్సీ విధించిన ఇందిరాగాంధీయే తర్వాత ఎమర్జన్సీ ఎత్తేసి 1977లో ఎన్నికలు జరపించారన్నది కూడా అంతే వాస్తవం. ఆ ఎన్నికల్లో ఆమె ఘోరపరా జయం పాలయ్యారు. ప్రజలు బుద్ధి చెప్పారు. ఎమర్జన్సీ కాంగ్రెసుకు మరిచిపోలేని గుణపాఠం నేర్పింది.

సరే ఎమర్జన్సీ ప్రధానంగా ప్రాథమిక స్వేచ్ఛలపై దాడి అనేది స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. ఇప్పుడు ప్రాథమిక స్వేచ్ఛలు ఎలా ఉన్నాయి. వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్ 2024 ప్రకారం భారతదేశం 180 దేశాల జాబితాలో 159వ స్థానంలో ఉందని వార్త. మూకహత్య జరిగిందన్న విషయాన్ని రాస్తే, రాసిన వ్యక్తిపై కేసు. అనేక మంది పాత్రికేయులు జైళ్ళలో ఉన్నారు. మీడియా వన్ చానల్‌పై నిషేధం విధించిన కేసు కూడా అందరికీ తెలిసిందే. తర్వాత దీనిపై కోర్టు తీర్పు వచ్చింది. అలాగే దేశంలో అనేక చోట్ల బుల్డోజర్ అనే పదం ఇప్పుడు చాలా ఎక్కువగా వినిపిస్తోంది. ఈ బుల్డోజర్ జస్టిస్ అనే పదం కూడా ప్రాథమిక హక్కుల నేపథ్యంలో ఆలోచించుకోవలసిన పదం. దేశంలో ప్రాథమిక హక్కుల పరిస్థితి గురించి ఇంకా వివరంగా రాయవలసిన అవసరం లేదు. ఇప్పుడు అందరికీ అర్థమవుతున్నదేమిటంటే ఎమర్జన్సీ రెండు విధాలుగా ఉండవచ్చు. రాజ్యాంగ నిబంధనలను ఉపయోగించుకుని బాహాటంగా ప్రకటించింది కావచ్చు. అప్రకటిత ఆత్యయిక పరిస్థితి కూడా ఉండొచ్చని చాలా మంది అర్థం చేసుకున్నారు. ప్రధానమంత్రి మొన్నటి ఎన్నికల్లో మంగళ సూత్రాల గురించి చెప్పారు. బర్రెల గురించి చెప్పారు. ధ్యాన ముద్ర పాటించారు. కాని ఆయన పాలనలో ఈడీ, సిబిఐ, ఇన్‌కంటాక్స్ విభాగాలపై ఎలాంటి విమర్శలు వస్తున్నాయో ఆయనకు తెలియవా?

1977లో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని తొలగించినప్పుడు జైళ్ళలో ఉన్న నేతలందరినీ వదిలిపెట్టడం జరిగింది. ఎన్నికల్లో పాల్గొనే అవకాశం వారికి లభించింది. కాని 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రులను కూడా జైళ్ళలో పెట్టడం జరిగింది. ముఖ్యమంత్రులను నెలల తరబడి జైళ్ళలో పెట్టడమే కాని వారి నేరాన్ని నిరూపించే ఒక్క ఆధారం కూడా చూపించలేకపోవడం రాజ్యాంగాన్ని కాపాడడమా? కేసుల బాధ తప్పించుకోడానికి ప్రతిపక్షాల్లోని కొందరు నేతలు బీజేపీలోకి చేరుతున్నారన్న వార్తలు కూడా వచ్చాయి. రవీంద్రవాయకర్ కేసుల నుంచి తప్పించుకోడానికే బీజేపీలో చేరానని చెప్పినట్లు వార్త. బీజేపీ వాషింగ్ మెషిన్ అనే ప్రచారం గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. నేడు గోదీ మీడియా అనే ప్రచారం కూడా బాగా జరుగుతోంది. నిప్పులేనిదే పొగరాదు. ఈ నిప్పు ఏమిటో ఎవరైనా గమనించారా? ఈ నిప్పు దేన్ని తగలబెడుతుందో గమనించారా?

సంవిధాన్ హత్యా దివస్ ప్రకటించిన వాళ్ళు రాజ్యాంగ విలువలకు ఎంత కట్టుబడి పనిచేస్తున్నారో అంతా చూస్తూనే ఉన్నారు. ఇక ఎమర్జన్సీ విషయానికి వస్తే అప్పట్లో నిషేధానికి గురైన 23 సంస్థల్లో ఆరెస్సెస్ కూడా ఉంది. 2018లో ఫ్రంట్ లైన్ పత్రికలో ఏజీ నూరానీ రాసిన వ్యాసం ప్రకారం అప్పటి ఆరెస్సెస్ అధినేత బాలా సాహబ్ దేవరస్ ఎమర్జన్సీని సమర్థిస్తూ ప్రధాని ఇందిరాగాంధీకి లేఖలు రాశారు.

ఏది ఏమైనా యాభయ్యేళ్ళ క్రితం ఎమర్జన్సీ ఇప్పుడు మళ్ళీ చర్చల్లోకి వచ్చింది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారిని పలకరించడానికి వెళ్ళినప్పుడు నరేంద్రమోడీ ఎమర్జన్సీ ప్రస్తావన తీసుకు వచ్చారు. ఈ సంవిధాన్ హత్యా దివస్ ప్రకటనకు ముందు కూడా లోక్‌సభలో ఎమర్జన్సీ ప్రస్తావనలే బీజేపీ చేసింది. కాని గమనించవలసిన విషయమేమిటంటే ఎమర్జన్సీ విధించిన ఇందిరాగాంధీనే మళ్ళీ మూడేళ్ళ తర్వాత దేశప్రజలు ఎన్నుకున్నారు. ప్రతిపక్షాలు రాజ్యాంగ పరిరక్షణ అని ధ్వజమెత్తుతున్నాయి. ఎన్నికల్లో బీజేపీకి దీనివల్ల బలమైన దెబ్బతగిలింది. ప్రతిపక్షాలను ఎదురుదెబ్బ తీయడానికి ఎమర్జన్సీని ఆయుధంగా చేసుకోవాలనుకునే ఈ ప్రయత్నం ఫలిస్తుందా? ఎమర్జన్సీని అప్పటి ప్రజలు భరించారు. అయినా ఆమెనే ఎందుకు మళ్ళీ ఎన్నుకున్నారు? ప్రత్యక్షంగా ఎమర్జన్సీ బాధలు పడిన ప్రజలే ఎమర్జన్సీని మరిచి ఆమెను ఎన్నుకున్నప్పుడు, ఇప్పుడు దేశంలో చాలా మంది ఓటర్లు ఎమర్జన్సీ కాలంలో పుట్టనే లేదు. వారికి ఎమర్జన్సీ గురించి చెప్పి కాంగ్రెసు పట్ల వ్యతిరేకత పెంచడం సాధ్యమా? బీజేపీ ఎత్తుగడ ఫలిస్తుందా?

ఎమర్జన్సీ తర్వాత ఈ యాభయ్యేళ్ళలో దేశం చాలా మారిపోయింది. ఇప్పటి తరం ప్రాధాన్యతలు వేరు. ఇప్పుడు పరీక్ష పేపర్ల లీకులు, అధిక ధరలు, నిరుద్యోగం, శాంతిభద్రతలు, వ్యాపార సౌలభ్యాలు వీటి గురించి ప్రజలు ఆలోచిస్తున్నారు కాని ఎప్పుడో జరిగిన ఎమర్జన్సీ గురించి కాదు.

ఎమర్జన్సీ కాలంలోనే దేశ రాజ్యాంగంలో అనేక సవరణలు కూడా జరిగాయి. రాజ్యాంగంలో అంతకు ముందు లౌకికవాదం అనే పదం

లేదు. ఎమర్జన్సీ కాలంలోనే ఈ పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు. గమనించవలసిన విషయమేమిటంటే ఎమర్జన్సీ ముగిసి, ఇందిరాగాంధీ దేశంలో ఎన్నికలు జరిపించినప్పుడు ఆమె ఓడిపోయి జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలో చేర్చిన ఈ పదాన్ని తొలగించలేదు. గత పదేళ్ళుగా నరేంద్రమోడీ పూర్తి మెజారిటీలో ఉన్నప్పుడు కూడా ఈ పదాన్ని తొలగించడం జరగలేదు. కాని దీనికి వ్యతిరేకంగా బీజేపీ నేతలు అప్పుడప్పుడు మాట్లాడడం వినిపిస్తూనే ఉంది. ఎమర్జన్సీ కాలంలో రాజ్యాంగం హత్యకు గురైతే ఈ పదేళ్ళలో ఈ విషయం గురించి ఎందుకు మాట్లాడలేదు. ఈ పదాన్ని తొలగిస్తామని బాహాటంగా ఎందుకు చెప్పలేదు.

ఎమర్జన్సీ విధించినప్పుడు సాధారణ ప్రజలంతా దాన్ని వ్యతిరేకించారని చెప్పడం కూడా కుదరదు. అల్పాదాయ వర్గాలు ఎమర్జన్సీని హర్షించాయనే చాలా మంది విశ్లేషిస్తున్నారు. అలాగే అప్పట్లో విదేశీ మారకద్రవ్యం నిలువలు కూడా పెరిగాయని కొందరు చెబుతారు. పారిశ్రామిక ఉత్పత్తులు కూడా పెరిగాయి. అధికధరలు అదుపులోకి వచ్చాయి. అవినీతి అదుపులోకి వచ్చింది. ఎమర్జన్సీలో బాధలకు గురైనవారు కూడా చాలా మంది ఉన్నారు. అనేక సంస్థలు, సంఘాల నేతలను జైళ్ళలో పెట్టారు. బలవంతపు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేశారు.

కాని ఇప్పటి ఓటర్లలో చాలా మందికి అసలు ఎమర్జన్సీలో ఏం జరిగిందనేది తెలియదు. ఇప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రతిపక్షాలు ఇచ్చిన పిలుపు ప్రజల్లో చొచ్చుకుపోయింది. దీనికి ముఖ్యమైన కారణం కూడా బీజేపీలోని అత్యుత్సాహం ఎక్కువైన నేతలే. 400 దాటితే రాజ్యాంగాన్ని మార్చేస్తామని కొందరన్నారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను తొలగిస్తారన్న భయాలు మొదలయ్యాయి. బీజేపీ, ఆరెస్సెస్‌లకు రిజర్వేషన్ల పట్ల వ్యతిరేకత ఉందని కూడా చాలా మంది నమ్ముతున్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలన్న నినాదం అందువల్లనే బీజేపీకి పెద్ద దెబ్బతీసింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా కాంగ్రెసు నాయకత్వంలోని ప్రతిపక్షాలు రాజ్యంగాన్ని రక్షించాలన్న నినాదం పలుమార్లు వినిపిస్తూనే ఉన్నారు. ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెసును ఎదురుదెబ్బ తీయదానికి బీజేపీ ఎమర్జన్సీ ప్రస్తావన తీసుకువస్తోంది. కాని యాభయ్యేళ్ళ క్రితం విధించిన ఎమర్జన్సీ ఏమిటో? దీనివల్ల అప్పట్లో ప్రజలకు జరిగిన నష్టమేమిటో ఇప్పుడు దాంతో తమకు సంబంధమేమిటో ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తారా? నిజానికి బీజేపీ ఎత్తుగడ బెడిసికొట్టే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే, ఎమర్జన్సీ తర్వాత కూడా సుదీర్ఘకాలం కాంగ్రెసు అధికారంలో ఉంది. కాని ఎన్నడూ ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నాలు జరగలేదు. కాని ఇప్పుడు బుల్డోజర్ న్యాయం వచ్చేసింది. నేరారోపణ తర్వాత నిందితుడే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే కొత్త నిబంధనలు, కొత్త మార్పులు జైళ్ళలో సుదీర్ఘకాలం నిర్బంధించి ఉంచడానికి ఉపయోగపడుతున్నాయి. ఈ పరిణామాలను ప్రజలు గమనించడం లేదా? అందువల్లనే అబ్ కి బార్ 400 పార్ అని బీజేపీ అన్నప్పుడు, ఈసారి 400 దాటితే రాజ్యాంగాన్ని మార్చేస్తామని కొందరు బీజేపీ నేతలు అన్నప్పుడు ప్రజల్లో ఒక విధమైన భయాందోళన చోటుచేసుకుంది రాజ్యాంగం గురించి ఈ చర్చను మరింత పొడిగించేలా ఇప్పుడు బీజేపి స్వయంగా సంవిధాన్ హత్యా దివస్ తీసుకువచ్చింది. ఈ చర్చలో ఎప్పుడో జరిగిన ఎమర్జన్సీ ఎక్కువ ప్రభావితం చేస్తుందా? ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు ఎక్కువ ప్రభావితం చేస్తాయా?

సంవిధాన్ హత్యా దివస్ ద్వారా ఇండియా కూటమిలో చిచ్చుపెట్టవచ్చని బహుశా బీజేపీ ఆశిస్తుండవచ్చు. ఎందుకంటే ఎమర్జన్సీ కాలంలో జైలుకు వెళ్ళిన నేతల్లో లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ఉన్నారు. ఆయన కుమార్తెకు అందువల్లనే మీసా భారతీ అని పేరుపెట్టారు. మీసా చట్టం క్రిందనే ఆయన అరెస్టు అయ్యారు. ఎమర్జన్సీ బాధితులైన ఇలాంటి కొందరు నేతలు ఇండియా కూటమిలో ఉన్నారు. వారెవ్వరు సంవిధాన్ హత్యాదివస్‌కు అభ్యంతరపెట్టలేరని బీజేపీ భావిస్తోంది. కాంగ్రెసును ఏకాకి చేసి దెబ్బతీయవచ్చనే ఆలోచన ఇందులో ఉంది. కాని లాలూ ప్రసాద్ యాదవ్ ఈ ఆశలపై చన్నీళ్ళు కుమ్మరించాడు. అప్పట్లో ఇందిరా గాంధీ తమను జైళ్ళలో పెట్టినా ఎవరినీ దేశద్రోహులంటూ దుర్భాషలాడలేదని అన్నారు. ఇప్పుడు ఎమర్జన్సీ గురించి మాట్లాడుతున్నవాళ్ళు అప్పట్లో ఎక్కడా పెదవి విప్పలేదని విమర్శించారు. జయప్రకాశ్ నారాయణ్ ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి అప్పట్లో తాను కన్వీనర్‌గా ఉన్నానని అన్నారు. ఎమర్జన్సీ మన ప్రజాస్వామ్యంపై ఒక మరకలాంటిది అంటూనే ఇప్పుడు ప్రతిపక్షాన్ని గౌరవించలేని వాళ్ళను కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. దీంతో నిరుత్సాహానికి గురైన బీజేపీ నాయకుడు నిఖిల్ ఆనంద్ ఇవన్నీ చవుకబారు రాజకీయాలన్నాడు. కాని చవుకబారు రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు కూడా గ్రహించగలరు కదా. 1975 ఎమర్జన్సీ కాలంలో గాంధీజీ హంతకులను పూజించడం జరగలేదని, యువత తమకు నచ్చిన వారిని జీవిత భాగస్వాములుగా ఎంచుకునేవారని, లవ్ జిహాద్ పేరుతో వేధింపులు అప్పట్లో లేవని చురకలు వేశారు. శివానంద్ తివారి అప్పట్లో ఆరెస్సెస్ నాయకుడు బాలాసాహెబ్ దేవరస్ మీసా చట్టం క్రింద అరెస్టయిన తర్వాత ఇందిరాగాంధీ 20 సూత్రాల పథకానికి మద్దతిస్తూ లేఖ రాయడం గురించి ప్రస్తావించారు. ఏది ఏమైనా అప్పట్లో ఎమర్జన్సీ వల్ల బాధలు పడిన నేతలు ఇండియా కూటమిలో ఉన్నారు కాబట్టి ఇండియా కూటమిలో చిచ్చుపెట్టాలన్న ఈ ప్రయత్నం కూడా బెడిసికొట్టినట్లే కనిపిస్తోంది. ఎందుకంటే ఈ ప్రకటన తర్వాత అఖిలేష్ యాదవ్ తీవ్రంగా ప్రతిస్పందిస్తూ మణిపూర్‌లో మహిళలు, హత్రస్ అమ్మాయి, లఖీంపూర్ రైతులు, కాన్పూరులో తల్లి కూతుళ్ళు, మూడు రైతు చట్టాలతో వ్యవసాయం వగైరాల హత్యా దివస్ ఎప్పుడు జరుపుతారని ప్రశ్నించాడు. స్వాతంత్ర్య పోరాటం తర్వాత ఆ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన వారంతా కాంగ్రెసు వారే కాబట్టి ఆ లాభం కాంగ్రెసుకు చాలా లభించింది. కాని స్వతంత్ర పోరాటాన్ని చూపించి కాంగ్రెసు దీర్ఘకాలం ప్రజల ఓట్లు పొందడం కూడా సాధ్యం కాదు. అలాగే ఎప్పుడో జరిగిన ఎమర్జన్సీని చూపించి ప్రజలను కాంగ్రెసుకు దూరం చేయడం కూడా సాధ్యం కాదు. ఇప్పుడు ఎవరు ఏమిటో? ఎవరు ఏం చేస్తున్నారో ప్రజలు చూస్తున్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ప్రజల్లోకి వెళుతున్న రాహుల్ గాంధీని అడ్డుకోడానికే ఎమర్జన్సీని చర్చల్లోకి తీసుకువస్తూ సంవిధాన్ హత్యా దివస్ ప్రకటించారని చాలా మంది భావిస్తున్నారు. కాని ఈ ఎత్తుగడ బెడిసికొడితే బీజేపీ ఏం చేస్తుందని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ✤

అధ్యాయం -15

39

# వ్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## 1. ఈ పరిణామాలకు కారణాలు

మహనీయ ఉస్మాన్ కాలంలోని వాడయినా లేదా ఆ తరువాతి కాలంలోని వాడయినా, ఏ చారిత్రక పరిశీలకుడయినా సమీక్షకుడయినా నిష్పక్షపాత విశ్లేషకుడయినా, పరిస్థితుల ఈ దుఖదాయక పరిణామాలు ఎక్కడ, ఎప్పుడు, ఏ కారణాల వల్ల జనించాయో చెప్పలేడు. ఇది, ఏదో ఒక ప్రత్యేక, ఏకైక విపత్తు కాదు, అనేక మూల కారణాలు, వెనకా ముందూ వచ్చి విచ్చిన్నానికి బీజాలు నాటి పోయాయి. దాని పంటలే నేడు మూడు పువ్వులు ఆరు కాయలుగా ముస్లిమ్ సముదాయాన్ని వెక్కిరిస్తున్నాయి.

దీనికి రెండు మూల కారణాలను లోగడ ప్రస్తావించాము. ఒకటి, ఇస్లామ్ అఖండనీయ వ్యాప్తి, ఆ వచ్చిన వారి సరయిన బోధన శిక్షణ కొరవడటం. రెండు, ఇస్రాయిలీలు ముస్లిముల్లో కలిసి పోయి ధార్మిక పునాదుల్ని పెకిళించి వేసే ఉద్యమం జరపడం. ఈ రెండు దిశలా జరిగిన దాడి ఇస్లామీయ సమాజాన్ని కదిలించి వేసింది. పైగా ధన సంపత్తి వల్ల జనుల్లో జీవన ప్రమాణాలు పెరిగి వారు విలాసవంతమయిన మనుగడకు అలవడ్డారు. మహనీయ ఉమర్(ర) తన కాలంలో సాధారణంగా చిన్న పెద్ద నాయకులపైన పెట్టిన అనునిత్యపు కట్టడి వల్ల కొంత అదుపు ఏర్పడింది.

మహనీయ ఉస్మాన్(ర) కాలంలోనూ మొదట చాలా వరకు ఆ నిర్బంధం పని చేసింది. ఎటువంటి ఉపద్రవం తలెత్త లేదు. పాలిత ప్రదేశాలు దూరమయిన కొద్దీ మానవ సహజంగానే విరోధులకు వారి కార్యకలాపాల అవకాశాలు లభించడం సులభతరమవసాగింది.

చరిత్రకారులు ఒక విషయం పట్ల ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. మహనీయ ఉమర్(ర) విస్తృతపరచిన విజయ పరిధులు మహనీయ ఉస్మాన్(ర) కాలంలో మరింతగా పెరిగాయి. ఇంకా నావికాదళం అదనమవడంతో అవి మరీ వృద్ధి చెందాయి. ఒక్క నాయకుడు ముఆవియా(ర) మటుకే యాభై సముద్ర పోరాటాలలో విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఈ కారణంగా కూడా అనంతమయిన సంపద ముస్లిములను ముంచెత్తింది.

సంపద అన్నది సముదాయాలను అనవసర ఆడంబరాలకు, విలాసాలకు, భోగలాలసకు గురి చేస్తుంది. వ్యక్తులయినా

సముదాయాలయినా నిరర్థక చర్చల్లో కాలయాపనకు లోనవుతారు. నిజ ధ్యేయం కనుమరుగయి పోతుంది. వృద్ధి వికాసాల పట్ల ఆంతర్యంలో స్థానం మిగులదు, అది కేవలం లాంఛనప్రాయంగా మాత్రమే వారిలో దర్శనమిస్తుంది. సమాజంలోని ప్రతి వర్గం పైన నిష్క్రియాతత్వం స్థానం స్థిర పరచుకుంటుంది. ఓ చారిత్రక సంఘటన చూడండి, ఈ అభిప్రాయాన్ని రూఢీకరిస్తుంది.

### ఆ చింపిరి బట్టల వారు ఏరి?

బనీ ఉమయ్యా ఖిలాఫత్ కాలంలో అఫ్గానిస్తాన్ పాలకుడు, రత్బీల్, ప్రభుత్వానికి కప్పం కట్టడం మానుకున్నాడు. సైనిక చర్యలకు సయితం తల వంచలేదు. ఓ చరిత్ర కారుని ప్రకారం, ఆ కాలంలో అతని వద్దకు కప్పం వసూలు చేసే వారు వెళ్ళినప్పుడు అతను, "వారెక్కడ? మునుపు వచ్చేవారు, వారి కడుపులు పస్తులుండే వారిలా లోనికి కుంచించుకు పోయి ఉండేవి, నుదుట నల్లని మచ్చలుండేవి, వారికి ఖర్జూరపు చెప్పులుండేవి" అన్నాడు.

"వారు వెనుకటి వారు, గతించిపోయారు" అని తెలిపినప్పుడు, ఆ పాలకుడు, "మీ ముఖాలు భోగలాలసుల వలె ఉన్నాయి, మీ వస్త్రాలు శ్రీమంతుల వలె ఉన్నాయి, మీలో వారి లక్షణాలేవీ లేవు, వారు శక్తి మంతులు, వాగ్దాన పాలకులు, సంకల్ప నిరతులు. ఇక వెళ్ళండి, వెళ్ళి విశ్రాంతి తీసుకోండి, ఉన్న దానితో తృప్తి చెందండి. మా వద్ద నుంచి కప్పం వసూలు చేసే తాహతు మీకు లేదు" అన్నాడు.

### మరో ఉదంతం!

ఖలీఫా ఉమర్ ఫారూక్(ర) ఖిలాఫత్ కాలంలో ఒకసారి ఆయన సమక్షంలో ఈరాన్ నుంచి వచ్చిన సంపద కుప్పలు పోసి ఉండగా ఆయన మాత్రం తల పట్టుకుని రోదిస్తున్నారు. అక్కడ ఉన్న వారు, "అమీరుల్ మూ'మినీన్! ఇది రోదించే సమయం కాదు" అన్నారు. దానికి ఆయన, "సంపదలు వస్తే ఈర్ష్య అసూయలు కూడా వెంట వస్తాయి. వీటి వల్ల జాతి సమైక్యత, సామూహిక శుభాత్మలకు చెదలు పడుతుంది" అన్నారు! ఇవి సముదాయం మరువ లేని మాటలు.

### మహనీయ ఉస్మాన్(ర)

ప్రవక్త, ఆయన తరువాతి ఖలీఫాల జీవితాలను చూసిన మహనీయ ఉస్మాన్(ర) కూడా ఇటువంటి భావనలకే ఊతమిచ్చారు. విలాసమయ జీవన విధానానికి ఆయన కూడా వ్యతిరేకమే. కాకపోతే తన సహజ ప్రవృత్తి రీత్యా మహనీయ ఉమర్(ర)లా కొరడా ఝుళిపించడం ఆయన విధానం కాదు. ఆ కారణంగా సరిహద్దుల విస్తృతి, సంపదల సమృద్ధి, ఇస్లామ్‌లోకి ప్రవేశించిన తరువాత తగిన శిక్షణ పొందని అపరిపక్వ ముస్లిముల మూలంగా తప్పనిసరిగా ఉత్పన్నమయిన పరిణామాలను, చిక్కులను ఆయన ప్రకృతిలోని మార్దవం ఎదురు చూడనూ లేదు, ఫలితంగా నిలువరించనూ లేక పోయింది.

★★★

# 2. చివరి పయనం

మూడవ ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర)ని సబాయీలు హత్య చేసిన తరువాత ఆయన మృతదేహాన్ని వారు ఖననం చేసేందుకు కూడా అనుమతించ లేదు. చరిత్రకారుల ప్రకారం, ఇతర కళేబరాలతో ఆయన అక్కడే ఉన్నారు, గాయ పడిన ఆయన సతీమణి మహనీయ నాయిలా(ర) కూడా ఆయనకు బాగా తోడుగా ఉన్నారు. సహచర మాన్యులు కొందరు మహనీయ అలీ వద్దకు వెళ్లి ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయన వెంటనే ముందుకు వచ్చి సహాయపడ్డారు.

### అంతిమ ప్రార్థన, వస్త్రం, ఖననం

మగ్రిబ్, ఇషా కాలం మధ్యన, రాత్రివేళ కొందరు వ్యక్తులు ప్రాణాలకు తెగించి జనాజా సిద్ధం చేసి దాన్ని మోసుకుని 'జన్నతుల్ బకీ' ఖననవాటికకు బయలుదేరారు. వారిలో మహనీయులు హకీమ్, జుబైర్, అబూ జహ్మ్, హసన్, మర్వాన్ ప్రభృతులు కూడా పాల్గొన్నారు. మహనీయ జుబైర్ ప్రార్థన చేయించారు. దారిలో వైరులు ప్రతిఘటించడానికి ప్రయత్నం చేశారు. వారిని మహనీయ అలీ(ర) గట్టిగా మందలించారు. అయినా వారు రాళ్లు రువ్వుతూనే ఉన్నారు.

జనాజా తెచ్చిన వారు త్వరత్వరగా ఖననం ముగించి, ఆ దుష్టులు శవాన్ని బయటకు తీస్తారో ఏమో అన్న సంశయం కారణంగా సమాధి చిహ్నాలు గోచరించకుండా నేలమట్టం చేశారు.

### ప్రకృతి ప్రకోపించే దుర్ఘటన!

మహనీయ ఉస్మాన్(ర) అమరగతి పొందడం సాధారణ విషయం కాదు, అదొక సామాజిక విస్ఫోటక దుర్ఘటన.

సహచర మాన్యులు ఎంతో వ్యాకుల పడుతున్నారు, రానున్న రోజుల్లో జరగబోయే పరిణామాలను గురించి తలచి కంపిస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరు విభిన్నంగా స్పందించారు. వారి ప్రకటనలలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ఉటంకిస్తున్నాము.

మహనీయ సయీద్(ర)బిన్ జైద్ (తొల్దొలి ముస్లిములు, మహనీయ ఉమర్(ర) బావ), ఇలా అన్నారు,

"జనులారా! మీరు మహనీయ ఉస్మాన్ పైన సాగించిన దౌర్జన్యాలను తాళలేక ఉహుద్ కొండ ప్రేలిపోయినా పెద్ద విషయమేమీ కాదు!"

మహనీయ సలమా(ర) బిన్ అక్వ పైన ఈ విఘాతం కలిగించిన ప్రభావం, బాధ చేత ఆయన మదీనా నగరం నుంచి రబ్జహ్ అనే చోటికి వెళ్లి పోయారు, అక్కడే జీవితం గడిపారు. ఎజీద్ బిన్ అబీ ఉబైద్ ప్రకారం ఆయన తన చివరి రోజుల్లో మదీనా తిరిగి వచ్చి అక్కడే పరమపదించారు.

మహనీయ అలీ(ర)కు మహనీయ ఉస్మాన్ అమరగతి గురించి తెలియగా ఆయన చేతులెత్తి ఇలా పలికారు, "దైవమా! నేను ఉస్మాన్ హత్యా ఉదంతానికి బహుదూరం!!"

మహనీయ అబ్దుల్లా ఇబ్ను అబ్బాస్(ర) అన్నారు, "ఒకవేళ ఈ హత్యలో జనులెల్లరు పాల్గొని ఉంటే లూత్(అ) జాతి మాదిరిగా ఆకాశం నుంచి రాళ్లు వర్షించేవి!"

మహనీయ హుజైఫా(ర) ఇలా నుడివారు,"ఉస్మాన్ అమరగతి వల్ల ఏర్పడిన వెలితిని ఓ పర్వతం కూడా పూడ్చజాలదు."

మహనీయ అబ్దుల్లా (ర) బిన్ సలామ్ అన్నారు, "నేడు ముస్లిమ్ సముదాయం ఛిన్నాభిన్నమయి పోయింది. అరబ్బుల శక్తి అమృతమయి పోయింది."

మహనీయ సుమామ(ర) బిన్ అదీకి తెలియగానే రోదించ సాగారు, ఎక్కిళ్ళ మధ్య ఇలా అన్నారు, "నేడు దైవ సందేశ హరుల స్థానంలో ఖలీఫాల కాలం ముగిసింది. ఇక రాచరిక కాలం మొదలవుతుంది."

మహనీయ జైద్ బిన్ సాబిత్ కళ్ళు వర్షించడం మానుకోలేదు.

మహనీయ అబూ హురైరా(ర) ఈ దుఃఖదాయక ఘటన ప్రస్తావన రాగానే నిరంతరం రోదించేవారు.

మహనీయ ఆయిషా సిద్దీకా(ర), "మహనీయ ఉస్మాన్(ర) ఉతికిన బట్ట వలె పరిశుద్ధమయిన వారు" అనేవారు. ★

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




ముహియుద్దీన్ గాజీ

### దారి చూపే దక్షత

రోగికి మంచి డాక్టర్ అడ్రస్ తెలుపటం, ఒక బాధితునికి మంచి న్యాయవాది (లాయర్)తో పరిచయం చేయించటం, పేరెంట్స్‌కి ఒక మంచి పాఠశాల వైపునకు గైడ్ చేయటం, విద్యార్థులకు, యువకులకు మంచి పుస్తకాల పేర్లు చెప్పటం, మంచి పెళ్లి సంబంధాలు ఉంటే పేరెంట్స్‌కి చెప్పటం, ఒకరికి న్యాయపరమైన మార్గదర్శకత్వం వహించటం, ఒకరికి కెరీర్ గైడెన్స్ చేయటం- ఇలా గైడెన్స్‌కు సంబంధించిన ఎన్నో రూపాలు ఉన్నాయి. గైడెన్స్ సంఘ సేవలో అత్యంత ముఖ్యమైన భాగం. ఒక అవసరార్థునికి జేబు డబ్బులు ఇవ్వటం కన్నా, అతనికి అవసరం తీరే దారి చూపటం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు - ఒక రోగికి ఉచిత వైద్య సహాయం అందే ఆసుపత్రి అడ్రస్ ఇవ్వటం లేదా అతి తక్కువ ఖర్చుతో ట్రీట్‌మెంట్ ఇచ్చే హాస్పిటల్‌కు పంపటం. ఒక పేదవాడికి ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర పథకాల ద్వారా లబ్ధి పొందే మార్గం చూపటం కూడా గొప్ప సేవే. ఇలా చేస్తే ఆ అవసరార్థునికి ఇతరుల ముందు చేయి చాపే దుస్థితి ఏర్పడదు.

దారి చూపే నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి సమాజంలోని వివిధ రంగాలను నిరంతరం స్టడీ చేస్తూ ఉండాలి. సామాజిక సంస్థల గురించి, సంఘ సేవ పథకాల గురించి, సంఘ సేవకుల గురించి నాలెడ్జ్ ఎక్కువగా ఉన్నవారే గైడెన్స్ విషయంలో బాగా తోడ్పడగలరు. వివిధ కోణాల నుంచి వారు సామాన్య ప్రజలకు లబ్ధి చేకూర్చగలరు.

ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల కార్యపరిధి యావత్ సమాజాన్ని పరివేష్టించి ఉంటుంది. అందుచేత వారు సమాజం గురించి క్షుణ్ణంగా తెలిసినవారై ఉంటారని, వివిధ రంగాలలో వారు జనులకు గైడ్ చేయటంలో విశ్వసనీయులై ఉంటారని ఆశించటం సహజం.

### ప్రోత్సహించాలి, ఉత్తేజపరచాలి

ప్రజలలో పెద్ద పెద్ద లక్ష్యాలను ఛేదించాలన్న ఉత్సాహాన్ని రేకెత్తించటం (Motivation) మనిషికి సమాజంలో మంచి గుర్తింపు తెస్తుంది. ఏదయినా శోధించి సాధించాలన్న ప్రేరణను పిల్లల్లో, యువకుల్లో నూరిపోయటం అవసరం. సంస్థాగత స్థాయిలో మోటివేషనల్ స్పీకర్లు ఈ పని చేసి

పాపులర్ అవుతుంటారు. చాలామంది వక్తలు కాలేరు. అయితే ఆకర్షణీయమైన తమ వ్యక్తిత్వం ద్వారా, ఉత్సాహ భరితమైన సంభాషణ ద్వారా వారు ఎదుటివారిలో కదలికను తీసుకువస్తారు. వారు స్టేజీపై నిలబడి, భారీ జన సమూహాన్ని ఉత్తేజపరిచే ప్రసంగాలు చేయలేకపోవచ్చు. అయితే వ్యక్తిగత స్థాయిలలో - చర్చల ద్వారా - ప్రజల హృదయాలలో ఆశా జ్యోతిని వెలిగించలరు. మనం గొప్పవారి జీవిత విశేషాలను గురించి చదువుతూ ఉంటాము. వారు కూడా ఎలాంటి పెద్ద కలలు కనకుండా సామాన్య జీవితం గడుపుతూ ఉండేవారు. అంతలో ఎవరో ఒక శ్రేయోభిలాషి తారసపడి వారికి ఒక లక్ష్యం నిర్దేశించారు. ఆ మధుర క్షణమే వారి జీవితాన్ని మలుపు తిప్పింది. అలాగే చదువు సంధ్యల్లో వెనుక బడిన వ్యక్తులు సయితం తమ భావి తరాల వారిని విద్యా విషయికంగా ప్రోత్సహించి ఉన్నత శిఖరాలకు చేర్చిన ఉదా హరణలు కూడా మనకు లభిస్తాయి.

## సమన్వయపరిచే సామర్థ్యం

సమాజంలో కొంతమంది అవసరార్థులుంటే, మరికొంత మంది అవసరాలను తీర్చే ఒనరుల్ని కలిగి ఉంటారు. వారి మధ్యన సమన్వయాన్ని (Co-ordination) ఏర్పరచటం, అను సంధానకర్తగా వ్యవహరించటం కూడా గొప్ప సంఘ సేవే. ఉదాహరణకు: సముదాయంలోని ఒక పేదవానికి అకస్మా త్తుగా పెద్ద మొత్తం కావలసి ఉంటుంది. కాని స్థితిమంతుల వరకూ వెళ్ళి తన గోడును వినిపించుకునే అవకాశం అతనికి ఉండదు. అట్టి పరిస్థితిలో ఆ వ్యక్తి పరిస్థితులను ఎరిగినవారు సమాజంలోని స్థితిమంతుని దగ్గరకు వెళ్ళి తన తరఫున గ్యారంటీ ఇచ్చి, కన్విన్స్ చేసి ఆ పేదవాని ఆర్థిక సహాయానికి స్థితిమంతుణ్ణి ఒప్పించినవారు కారుణ్య దూతగా రూఢీ అవు తారు. అవసరార్థుని అవసరం తీర్చేంత ఆర్థిక స్థోమత మీకు లేకపోవచ్చు, కాని సమన్వయకర్తగా వ్యవహరించే మీ సామర్థ్యం వల్ల ఎన్నో మంచి పనులు, మీ ద్వారా జరుగు తాయి.

సమన్వయాన్ని సాధించే ప్రతిభ ద్వారా సామాజిక సేవకు సంబంధించిన ఎన్నో కార్యాలు జరగవచ్చు. హాస్పిటల్‌లో ఒక రోగికి చికిత్స, స్కూల్లో ఒక విద్యార్థి స్పాన్సర్‌షిప్, సంక్షేమ సంస్థల ద్వారా అవసరార్థులకు ఆర్థిక సాయం చేయటం, ప్రభుత్వ కార్యలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి చర్చించి, అవసరార్థులను సదరు డిపార్ట్‌మెంట్‌లకు పంపించి కార్యాన్ని చక్కబెట్టడం వంటి ఎన్నో పనులు చేయవచ్చు.

స్థితిమంతులతో కానివ్వండి, లేదా పదవుల్లో ఉన్నవారితో కానివ్వండి, వారితో మీకు గల సత్సంబంధాలు మీకున్న శక్తి అని మరువకండి. కాని ఈ శక్తిని గనక మీరు స్వార్థ ప్రయోజనాల కొరకు వాడుకుంటే, ఆ శక్తి మీ బలహీనతగా మారిపోతుంది. కాబట్టి స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా ఉంటూ మీ శక్తిని కాపాడుకోండి. దానిని ప్రజోపయోగ కార్యాలకై వెచ్చించండి. సమన్వయకర్తగా బాధ్యత నెరవేర్చడా నికి మీరు సమాజంలోని పలుకుబడి కల వ్యక్తుల కోవకు చెందినవారై ఉండనవసరం లేదు. సమాజంలోని సాధారణ వ్యక్తి కూడా తనలోని నిజాయితీ తత్పరత, సమన్వయ ప్రతిభ కారణంగా సమాజంలోని ఎన్నో చిన్న పెద్ద పనులు చేయ గలడు.

## విశ్లేషణ, స్ట్రాటజీ

సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను లోతుగా అధ్య యనం చేసి వాటిని విశ్లేషించి, వాటిని చక్కగా విడమరిచి చెప్పేవారు సొసైటీలో అందరి దృష్టినీ ఆకర్షిస్తారు. ఆవేశ పూరిత స్వభావం కలవారు ఉద్రేకపూరితమైన విశ్లేషణలు చేస్తారు. ఏదయినా ఒక పార్టీకి చెందినవారైతే, వారు తమ పార్టీ కళ్ళద్దాలు పెట్టుకునే ఆ సమస్యను చూస్తారు. మరికొంతమంది చేసే స్థూల దృష్టితో కూడిన విశ్లేషణలు బరువును కోల్పోతాయి. ఇట్టి పరిస్థితిలో పక్షపాతానికి, దురభి మానానికి దూరంగా ఉంటూ, ప్రశాంత మనసుతో విషయం లోతుల్లోకి వెళ్ళి, పరిస్థితుల స్వరూపాన్ని తరచి చూసి పరిష్కారం సూచించేవారి మాట సమాజంలో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

లోతైన విశ్లేషణతోపాటు విజయవంతమైన స్ట్రాటజీ (Strategy) కూడా సమాజానికి ఎంతో అవసరం. సాధారణంగా జనులు ఆవేశంతో కూడిన సలహాలిస్తారు. లేదా నిరాశ పరిచే మాట లంటారు. ఏదయినా స్కీమ్‌ను ప్రతిపాదిస్తే చాలామంది దానిని అసంభవమని చెప్పి ఆ ప్రతిపాదన చేసినవారి ఆత్మ విశ్వాసాన్ని నీరుగారుస్తారు. స్కీమ్ విజయవంతం అయ్యేం దుకు మంచి స్ట్రాటజీని రూపొందించి ఇచ్చేవారు చాలా కొద్దిమందే ఉంటారు. సమాజంలో ఎదురైన సమస్యలను అధిగమించడానికి, సమాజ పురోగతికి దోహదపడే పలు పథ కాల అమలు కోసం సమయోచిత ఆలోచన (Stratagic thinking) అవసరం.

పరిస్థితులను బేరీజు వేసి, సమస్యలను సందర్భోచితంగా విశ్లేషించి అత్యుత్తమ స్ట్రాటజీని అందించేవారే వాస్తవానికి సమాజానికి సిసలైన మార్గదర్శకులు. సమాజంపై ఇలాంటి వారి ప్రభావం మెండు. ఇస్లామీయ ఉద్యమంలోని వ్యక్తులు దీనిపై శ్రద్ధ వహించాలి. మంచి విశ్లేషణలను అధ్యయనం చేయటం వల్ల, వినటం వల్ల ఈ నైపుణ్యం అబ్బుతుంది. సమయోచిత కార్యాచరణ కూడా మనిషి యొక్క ఒక ప్రత్యేక స్ట్రాటజిక్ సెన్స్ (Strategic sense). నిరంతర సాధన ద్వారా, తర్ఫీదు ద్వారా ఈ కళ వంటబడుతుంది.

## లాభదాయకమైన పరిజ్ఞానం

మానవ జీవితంలో నాలెడ్జ్ ప్రాముఖ్యత నానాటికీ పెరిగి పోతోంది. పరిజ్ఞానాన్ని పొందే సాధనాలు పెద్దఎత్తున అందు బాటులో ఉన్నందువల్ల, ఆధునిక సాధనాలను ఉపయోగించి ప్రమాణబద్ధమైన ప్రయోజనకరమైన నాలెడ్జ్‌ని సమకూర్చే వారి ప్రాధాన్యత బాగా పెరిగిపోయింది. ఈ పరిజ్ఞాన వెల్లువలో ఏది తప్పు ఏది ఒప్పు అని నిర్ధారించుకోవటం కూడా కష్టమైపోయింది. ఇలాంటి పరిస్థితిలో సమాజానికి మార్గదర్శకత్వం వహించే వ్యక్తుల బాధ్యత ఏమిటంటే వారు ప్రామాణికమైన పరిజ్ఞానమేదో, ఫేక్ సమాచారమేదో వాటి మధ్య విచక్షణా రేఖ గీయాలి. దీనికోసం వారు స్వయంగా బాగా స్టడీ చేయాలి. విషయ పరిజ్ఞానానికి సంబంధించిన మూల సరోవరంతో సంపర్కం ఏర్పరచుకోవాలి. ఒకవైపు తప్పొప్పుల వెల్లువ ఉధృతంగా ప్రవహిస్తుంటే, మరో వైపున ఏది తప్పో, ఏది ఒప్పో నిర్ధారించే అడ్వాన్స్‌డ్ ఒనరులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఏ హదీసు ప్రామాణికమైనదో, మరేది బలహీనమైనదో తెలియపరచే ప్రమాణ నికషం కూడా ఉంది. విశ్వసనీయమైన సమాచారమేదో, ఫేక్ న్యూస్ ఏదో పసిగట్టే సాధనాలు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని నకిలీ వీడియోలు ఒక్కోసారి సమాజం పాలిట వినాశకరంగా పరిణమిస్తున్నాయి. అదే సమయంలో నకిలీ వీడియోల గుట్టు రట్టు చేసే సాధనాలు కూడా సులభంగా అందుబాటులో ఉన్నాయి.

## కష్టాల్లో ఉన్న వారిని పలకరించటం

కష్టాల్లో ఉన్నవారి కష్టాలను తెలుసుకోవటం ఇస్లామీయ సంప్రదాయానికి సంబంధించిన ముఖ్యమైన అధ్యాయం. ప్రజల కష్టాలను తెలుసుకోవటానికి సన్మార్గగాములైన ఖలీఫాలు రాత్రిపూట గస్తీ చేసేవారు. తామెవరో తెలియకుండానే వారికి సహాయం అందజేసేవారు.

వ్యక్తులను పట్టి పీడిస్తున్న ఎన్నో రుగ్మతలకు చికిత్స ఒక్కగానొక్క వ్యక్తి చేయలేకపోవచ్చు. కాని మొత్తం సమాజం వద్ద ఆ చికిత్స ఉంటుంది. కాకపోతే సమాజంలోని బాధ్యతాయుతులైన వ్యక్తులు పీడితులను వాకబు చేస్తూ ఉండాలి. వారు బాధితులకు- సామాజిక ఒనరులకు మధ్య వారధిగా నిలబడాలి.

సమాజంలో ఇస్లామీయ ఉద్యమ వ్యక్తులు అనుసంధాన కర్తలుగా వ్యవహరించాలి. కష్టాల్లో ఉన్నవారు ఎవరైనా సరే వారు తమ కష్టాల్ని ఉద్యమ కార్యకర్తల దృష్టికి తీసుకురాగలగాలి. తమ గోడును వారికి వినిపిస్తే పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం బాధితులకు కుదిరేలా కార్యకర్తలు మసలుకోవాలి.

మీరు ధనవంతులై ఉంటేనే కష్టాల్లో ఉన్న పేదవారిని ఆదుకోగలమని భావించకండి. మీరు స్వయంగా పేదవారై ఉన్నప్పటికీ సమాజంలోని పీడిత తాడిత వ్యక్తులను పసిగట్టగలరు. స్థితిమంతులను సంప్రతించి వారి కష్టాలను దూరం చేయగలరు.

కష్టాలు కేవలం పేదవారికే రావు. ధనవంతులు కూడా రకరకాల కష్టాలకు గురై ఉంటారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్నవారి కష్టాలు మరింత ఎక్కువగా ఉంటాయి.

**(ఇంకా వుంది)**

**"జిందగీ-యె-నౌ" సౌజన్యంతో**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# సమాజ నిర్మాణంలో నైతిక విలువలు

**- ఎస్.ఎమ్. మలిక్**

**మానవ** సంబంధాలు సమాజ నిర్మాణంలో ప్రముఖ భూమిక నిర్వహిస్తాయి. మనిషికి ఎటువంటి భావనలు, సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలను పరిచయం చెయ్యక అతని సహజ ప్రవృత్తులకు అతన్ని వదిలిపెట్టినట్లయితే అతను కోరుకునే విషయాలు, తాను నివసించే సమాజం గురించి అతని సహజ వాంఛలు ఎలా ఉంటాయి? ఇది ఆలోచించవలసిన ఒక మహా అద్భుతమయిన అంశం!

### మానవ ఇచ్ఛ

ఒకటి, అవి ఇలా ఉంటాయన్నది ఒక ఊహ- తనకు, తోటి మానవులకు మధ్య ఎటువంటి తారతమ్యాలు ఉండకూడదు. మనుషులంతా సమాన స్థాయిలో జీవించగలగాలి. ఎవరూ ఎవరికీ లోబడి లేదా క్రింది స్థాయిలో జీవించరాదు. అందరూ ఒకే జాతి- మానవ జాతిగా మెలగాలి.

రెండు, ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ లభించాలి. తాను తన ఆలోచనలకు, ఆచరణలకు ఎవరికీ కట్టుబడి ఉండరాదు; ఆ మాటకు వస్తే ఎవరూ ఎవరికీ ఆలోచనల రీత్యాను, ఆచరణల రీత్యాను జవాబు చెప్పుకోవలసిన అవసరం కలగరాదు. ప్రతి వ్యక్తి సర్వ స్వతంత్రుడుగా మనగలగాలి!

మూడు, వ్యక్తుల ఆలోచనలు ఎలా ఉన్నా ఆచరణ మాత్రం ఎదుటి వ్యక్తికి హానికరం కానిదయి ఉండాలి. ఒకరి చేష్టల వల్ల మరొకరికి ఎటువంటి నష్టం, కష్టం, బాధ కలగరాదు. మానవ సహజమయిన భావన, ఇతర మానవులకు తనకూ మధ్య సంబంధం ఈ విధంగానే ఉండాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు. ఇదే మానవత అని భావిస్తాడు ప్రతి వ్యక్తి!

ఇతర విషయాలన్నీ ఈ మూడు అంశాల క్రిందే వస్తాయన్నది మనం కాస్త ఆలోచించుకున్నా ద్యోతకమయిపోతుంది. అయితే ఈ మూడు భావనల్ని ఒకే చోట, ఒకే తరుణంలో పెట్టి పరిశీలిస్తే ఇవి పరస్పర విరుద్ధమయిన భావనలని తేలిపోతుంది.

### సాధ్యమా?

సమాజం అన్న తరువాత స్త్రీలు, పురుషులు, వీరిలో యవ్వనంలో ఉన్నవారు, వృద్ధులు ఇంకా బాల బాలికలూ ఉంటారు. వీరిలో సమానత సాధ్యమా? ఆలోచించండి!

అలాగే శక్తి సామర్థ్యాల రీత్యా, గుణగణాల రీత్యా, బుద్ధి కుశలత రీత్యా, సృజన తత్వం రీత్యా, కల్పనా శక్తి దృష్ట్యా సమానత్వం ఉంటుందా? మానవ అనుభవం, అలా సాధ్యం కాదన్నదే వాస్తవమని చాటి చెబుతోంది!!

అలాగే మనిషి కోరుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమాజంలో సాధ్యమవుతాయా? ఒకరికి లభించే సర్వ స్వతంత్రత మరొకరి నోటికి, చేతులకు, కాళ్ళకు ప్రతిబంధకంగా మారకుండా ఉండగలదా? సామాజిక వ్యవస్థలో అది సాధ్యపడని అంశమని ఇట్టే స్పష్టమయిపోతుంది.

ఇంకా మూడవ విషయానికి వస్తే అటువంటి కోరిక సహజమే, శుభప్రదమే, సాధ్యమయినదే అనే విషయం ముందుకు వస్తుంది. కాని మనిషి తొలి రెండు కోరికలు అమల్లోకి వస్తే ఇది బాగా దెబ్బ తింటుంది!

సమాజం శాంతియుతంగా, మానవుల మధ్య పరస్పర సత్సంబంధాలు కలదిగా, సామాజిక మనుగడ సజావుగా సాగాలంటే కొన్ని సూత్రాలు, నియమాలు, నియమిత ఆచరణా విధానాలు అవసరమనే నిర్ణయానికి రావలసి వస్తుంది.

ఆ సూత్రాలు ఎవరు ఏర్పరచాలి? ఆ నియమాలు ఎవరు అందజేయాలి?? ఈ ప్రశ్నలే ప్రధానమయినవి.

### మానవ కల్పనా శక్తి

ప్రపంచ మానవ చరిత్రలో ఇటువంటి సిద్ధాంతాలు, సూత్రాలు, నియమాలు రచించగలిగిన మహా మేధావులు కొందరున్నారు.

వారు అందజేసిన సిద్ధాంతాలయినా, నియమావళి అయినా ఆయా వ్యక్తుల ఊహాజనితమయినవి గనక, విభిన్న వ్యక్తుల ప్రతిపాదనలు పరస్పరం విరుద్ధంగా, ఒకదానికి మరొకటి పొంతన కుదరదని చరిత్ర స్వయంగానే అనుభవపూర్వకంగా తేల్చివేసింది. అయితే సమాజం సర్వ విధాలా సక్రమమయిన రీతిలో కొనసాగాలంటే మానవ వ్యక్తిగత జీవితంలోనూ, సామూహిక జీవితంలోనూ క్రమబద్ధత అవసరమన్న మాటను చరిత్రే చాటింది.

ఇక ఆదర్శవంతమయిన సమాజం ఎలా ఉంటుంది అనే విషయమై మానవుని అనుభవం చాటి చెప్పేదేమిటంటే, అందులో మానవుల మధ్య పరస్పర సానుభూతి, ప్రేమ, సేవ, కరుణ, దయా దాక్షిణ్యాలు పరిఢవిల్లాలి, అప్పుడే ఆదర్శ ప్రాయమయిన సమాజం ఏర్పడగలుగుతుంది. మానవుని కోర్కెలపైన సమంజసమయిన నియంత్రణ ఉన్నప్పుడే అది ఉనికిలోకి రాగలుగుతుంది.

ఈ నియంత్రణ కొరకు చట్టాలు, శాసనాలు అవసరం; వాటిని అమలు పరిచేందుకు తగిన అధికారం గల వ్యవస్థ అవసరం. ఆ వ్యవస్థనే మానవుడు 'పరిపాలన' అన్నాడు. అధికారం శ్రుతి మించినట్లయితే అది నియంతృత్వం (Dictatorship) వైపునకు గొనిపోతుంది.

నిరంకుశత్వం, నియంతృత్వం, హింసకు, దౌర్జన్యానికి దారి తీస్తుంది. అందువల్ల అధికారాన్ని కూడా కట్టడి చేయగల వ్యవస్థ స్వయం పరిపాలనా వ్యవస్థలోనే అవసరం!

అయితే మనిషి ఇన్నేసి నియమ నిబంధనలతో, గుణవంత మయిన, నైతిక బాధ్యత గల వ్యవస్థను, పాలనా రంగంతో సహా నిర్మించగలడా?

అందువల్లనే మానవులు "అందరూ కలసి సమాజాన్ని నిర్మించాలి, నడపాలి" అని సూత్రీకరించుకున్నాడు మనిషి. అయినా అది సాధ్యపడలేదు. ఎన్ని చేసినా అవసరమయిన ఆదర్శప్రాయ మయిన వ్యవస్థను మానవుడు ఎన్ని విధాల ప్రయత్నించినా తన స్వంత బుద్ధిజ్ఞానాల ఆధారంగా కనిపెట్టలేకపోయాడు, ఇది యథార్థం. ఎందుకంటే మానవుడు సహజంగా కోరుకునేది, ప్రారంభంలో చర్చించుకున్న మూడు అంశాలు అతని ఆంతర్యంలో సహజంగానే ఉన్నాయి. మానవుని వ్యక్తిగత సామూహిక జీవితాన్ని సజావుగా సక్రమంగా నడిపే వ్యవస్థను కేవలం మానవుని సకల సహజ గుణగణాలను ఎరిగిన శక్తి మాత్రమే రూపొందించ గలుగుతుంది.

## మరికొన్ని ఆలోచనలు

కొందరు మేధావులు, సమాజాన్ని మానవులు ఎంతగా కష్టపడినా ఆదర్శవంతమయినదిగా నిర్మించలేరన్న నిర్ణయానికి వచ్చి, మానవులు సమాజాన్ని కాదు మానవ మనుగడను తీర్చిదిద్ది, దాన్ని సామాజిక అవసరాలు, వ్యక్తిగత అవసరాలు అన్నింటికీ అనువయినదిగా మలచాలని ప్రతిపాదించారు. ఇందులో కొంత సామంజస్యత కానవచ్చినా మనిషిని కోర్కెలు, ఆశలు, ఆశయాలు, ఆవేశాలు, ఉద్రేకాలు అన్ని సహజంగా ఉన్న మానవుణ్ణి ఏ సిద్ధాంతం ప్రకారం, ఏ ప్రమాణాల ప్రకారం, ఎవరు తీర్చిదిద్దగలరు?

ఇదో, ఇటువంటి మలపులోనే మానవుని సకల సహజ లోపాలకు కొరతలకు అతీతమయిన శక్తి ఒకటి అవసరమవుతుంది. ఆ శక్తినే మనిషి దైవం అనీ, సృష్టికర్త అనీ, సర్వేశ్వరుడని నిర్ణయించాడు. ఇటువంటి ఉనికి ఒకటి కేవలం మానవ కల్పన కాదు, సృష్టి యావత్తులో ఇదే పరమ సత్యం అని సృష్టిలోని ఒక్కొక్క నీటిబొట్టు, చెట్టు, గుట్ట, పుట్ట- నేలపైన ఉన్నది సర్వం సాక్ష్యం పలుకుతోంది. అంతేకాదు నేలను దాటి గగనతలంలో విహరించే కోటానుకోట్ల నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, వాటి మధ్య ఉన్న పరస్పర నియంత్రణ, క్రమబద్ధత సాక్ష్యమిస్తున్నాయి. ఈ జగతి యావత్తు ఇట్టే ఉనికిలోకి రాలేదు. దీనికి ఒక కర్త, స్వామి ఉన్నాడని, ఆయనే మానవుని కర్త కూడా అని మనిషిలోని రక్త బిందువులు మొదలుకొని మనస్సు, మేధ కూడా సాక్ష్యం పలుకుతున్నాయి. ఇది నేటి ఆవిష్కరణ కాదు, మనిషి సృష్టిని అధ్యయనం చేసిన మరుక్షణమే కనుగొన్నాడు ఈ యధార్థాన్ని. ఈ అధ్యయనమే నేడు సైన్సు (శాస్త్రం) అనబడుతోంది. ఇటువంటి ఆలోచననే నేడు శాస్త్రీయ ఆలోచనా విధానం (Scientific Thinking) అనీ అంటున్నాము.


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఈ విధానాన్ని బలపరుస్తేనే సృష్టికర్త నియమించిన ప్రవక్తలు, గ్రంథాలు, సృష్టిని, సృష్టికర్తను, వీటి యథార్థాన్ని మన ముందుకు తెచ్చి ఆలోచించమని ప్రోత్సహించాయి. దైవం తన ప్రవక్తలు, సందేశహరుల ద్వారా అందజేసిన గ్రంథాలలో చిట్టచివరి గ్రంథం, దివ్య కుర్‌ఆన్ కూడా ఇదే విషయాన్ని ఘంటాపథంగా చాటుతోంది.

## కుర్‌ఆన్ విశ్లేషణ

మానవుని తొలి ఇచ్ఛ, సర్వ మానవ సమానతను గురించి దైవగ్రంథం కుర్‌ఆన్ ఇలా అంటుంది :

> **మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము, ఇంకా మిమ్మల్ని వర్గాలుగా, తెగలుగా కూడా ఏర్పరిచాము, వాస్తవానికి (ఈ విభజన మీలో తారతమ్యాన్ని కల్పించేందుకు కాదు). మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకుగాను (మాత్రమే ఇలా చేశాము). నిజానికి మీలో దైవం పట్ల భయభక్తులతో జీవించే వాడే గౌరవనీయుడు. (అల్ హుజురాత్ 49: 13)**

అంటే మానవుల మధ్య తారతమ్యాలన్నీ స్వయంగా మనిషి తన పెత్తనం చెలాయించడానికి సృష్టించుకున్నవే తప్ప సృష్టికర్త మానవుల మధ్య వర్ణాలు, వర్గాలు కేవలం పరస్పర పరిచయానికి మాత్రమే సృజించాడు అన్న సత్యాన్ని ఈ దైవ వచనం చాటుతోంది.

ఈ వచనం ద్వారానే ప్రస్ఫుటమయ్యే మరో యథార్థం, సృష్టికర్త మానవుణ్ణి స్వేచ్ఛాజీవిగా మటుకే సృష్టించాడు కాని మనిషి తన దుష్టబుద్ధి కారణంగా ఇతరులపైన తన దార్ష్టీకం చెలాయించ డానికి వారి స్వేచ్ఛను పరిహరించి దౌర్జన్యపూరితంగా బానిస జాతులుగా, బానిస దేశాలుగా మార్చుకున్నాడు. నిజానికి వారు ప్రకృతి నియమాలకు, లేదా సృష్టికర్త ఏర్పరచిన విధి విధానాలకు తప్ప మరి దేనికీ లోబడి లేరు. మరెవరికీ లోబడి జీవించనవ సరమూ లేదు.

మానవుని మూడవ ఇచ్ఛ, మానవత, గౌరవాదరణలు, నైతికతా ప్రమాణాలను గురించి ఇదే వచనం, “దైవాదేశాలకు లోబడి, సృష్టికర్త నియమించిన ప్రమాణాలకు కట్టుబడి మనగలిగినవారికే ఇహంలోనూ పరంలోనూ దైవం, సృష్టికర్త దృష్టిలో గౌరవాదరణలు ప్రాప్తమవుతా”యని గట్టిగా వక్కాణిస్తోంది.

ఈ వచనంలోని ప్రమాణాల ప్రకారం మానవుణ్ణి పరికించి, పరీక్షించి చూసినట్లయితే మానవ సమాజ నిర్మాణం అతి సునాయాసంగా కాగలదని స్పష్టమవుతోంది.

మానవులు తమ సమాజం శాంతియుతంగా, పరిశుద్ధంగా, పవిత్రంగా పరిఢవిల్లాలని కోరుకునే మాటయితే ఈ ప్రమాణాల గీటురాయిపైన పరిశీలించుకోవడం తప్ప గత్యంతరం లేదని బోధపడుతుంది.

## సమాజం సాఫీగా సాగడానికి...

ఆ తరువాత కేవలం సమాజ నిర్మాణం జరగడంతో అది సజావుగా శాంతివంతంగా సాగుతుందన్న నమ్మకం కూడా లేదు. దానిగ్గాను కనీసంగా కొన్ని నియమాలను సతతం పాటించడం కూడా అవసరమే. అందుకే దైవగ్రంథం ఈ విషయంలోనూ దారి చూపుతోంది!

> **దైవాన్ని, దైవగ్రంథాన్నీ విశ్వసించిన జనులారా! అధికంగా కుశంకలకు పాల్పడకుండా జాగ్రత్త వహించండి, కొన్ని అనుమానాలు పాపంగా పరిణమిస్తాయి. అలాగే ఇతర విషయాల పట్ల అనవసరమయిన కుతూహలం చూపకండి, ఇంకా మీలో ఎవరూ మరొకరిపైన పరోక్షంగా చాడీలు చెప్పకండి; (అది మృత సోదరుని మాంసం భుజించడంతో సమానం) మీలో ఎవరయినా తన మృత సోదరుని మాంసం భుజించడానికి ఇష్టపడతాడా? చూడండి, మీరు స్వయంగానే దాన్ని ఏవగించుకుంటారు. (అల్ హుజురాత్ 49: 12)**

ఇందులో ప్రస్తావించబడిన రెండు చెడుగులు మౌలికంగా సమాజంలో విచ్ఛిన్నతకు దారి తీసేవే. నిరాధారమయిన అనుమానాలు, పరస్పరం చాడీలు చెప్పుకోవడం- ఈ రెండు దుర్గుణాలు ఏ సమాజంలో చోటుచేసుకుంటాయో అది ఏ నాటికీ శాంతిని, సౌభాగ్యాన్ని ఆస్వాదించజాలదు. అందువల్లనే సమాజం సజావుగా, ప్రేమమయంగా, శాంతిపూర్వకంగా నాలుగు కాలాల పాటు కొనసాగాలంటే ఈ ప్రధానమయిన రోగాలను సమాజంలో అడుగు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండవలసి ఉంటుంది. సమాజ శ్రేయాన్ని కాంక్షించేవారు సతతం జాగరూకులయి, వీటి గాలి కూడా సమాజానికి సోకకుండా మెలుకువతో మెలగవలసి ఉంటుంది. ❖

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ఆరోగ్యమే అసలైన ఆస్తి

**సేకరణ : ఇమామ్‌జీ**

**శరీరం, లోపల పరిశుభ్రమైతే ఎలా ఉంటుంది?**

జంతువులు పైకి అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ వాటి లోపలి శరీరం మాత్రం చాలా పరిశుభ్రంగా ఉంటుంది. చివరకు మాంసాహారాన్ని తిని జీవించే జీవుల క్రూర మృగాల శరీరమూ అంతే. అదే మనిషి శరీరమైతే పైకి చాలా శుభ్రంగా, మంచి వాసనతో ఉన్నప్పటికీ లోపలి శరీరం మాత్రం, భూమి మీద ఏ జంతువు శరీరంలోనూ లేనంత అపరిశుభ్రత ఉంటుంది. ఎవరి లోపల ఉన్నది ఎంత పరిశుభ్రమో లేదా ఎంత అపరిశుభ్రమో అన్నది తేల్చుకోవడం ఎలా అనుకుంటున్నారా? దీని కోసం పైసా ఖర్చు అక్కర్లేదు. డాక్టర్ ఫీజు అంతకంటే అవసరం లేదు. రక్త పరీక్షలతో, ఎక్సరేలతో అసలు పనే లేదు. ఇక అసలు విషయానికొస్తే:

మొదటిది, నిద్ర లేచిన వెంటనే మీ నోరు దుర్వాసన రాకుండా లాలాజలం తియ్యగా ఉంటే, మీలో ఉన్న 70 శాతం నీరు పరిశుభ్రంగా ఉన్నట్లు తెలుసుకోవచ్చు.

రెండవది, మీ నాలుక మీద పాచి మందంగా లేకుండా, నాలుక చేదు లేకుండా పరిశుభ్రంగా ఉంటే మీ జీర్ణాశయం పరిశుభ్రంగా ఉన్నట్లు అంచనా వేయవచ్చు.

మూడవది, స్నానం చెయ్యకపోయినా సబ్బు పెట్టకపోయినా మీ చెమట కంపు కొట్టకూడదు. అలా ఉంటే మీ చర్మం పూర్తిగా పరిశుభ్రంగా ఉన్నట్లు.

నాలుగవది, మీరు ఎప్పుడు మూత్రం పోసినా, బాత్రూంలో నీరు పొయ్యక పోయినా మీ బాత్రూం కంపు కొట్టకూడదు. మీ మూత్రం ఎప్పుడూ పలుచగా, తెల్లగా వస్తూ ఉంటే, మీ లోపల ఉన్న 5 లీటర్ల రక్తం పరిశుభ్రంగా ఉందని అర్థం చేసుకోవచ్చు.

ఇక ఐదవది చూస్తే, మీ విరేచనం ఎప్పుడు వచ్చినా ప్లేటుకు అంటకుండా మరకలు పడకుండా, వాసన లేకుండా, క్షణాల్లో బయటకు వచ్చేస్తుంటే, దాన్ని బట్టి మీ లోపల ఉండే కోటాను కోట్ల జీవకణాల పరిశుభ్రతను, ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు.

★★★

ఇప్పటి వరకూ చెప్పిన ఐదు విషయాలలో వాసన లేకుండా గనుక ఉంటే, మీ శరీరం లోపల పరిశుభ్రంగా, ప్రశాంతమైన వాతావరణంలో మీ అవయవాలన్నీ జీవిస్తున్నాయనే తెలుసుకోండి. లేదా వాసనలు ఎంత గాఢంగా వస్తూ ఉంటే, మీ లోపల అంత మురుగు గుంట వాతావరణం ఉన్నట్లుగా గ్రహించండి. జంతువులు రోజు నాలుక గీయవు, పేస్టు పెట్టి పళ్ళు తోముకోవు, పుక్కిలించవు, సబ్బులు, పౌడర్లు వాడవు. మల మూత్రాలు విసర్జించినా అక్కడా కడుక్కోవు. అయినా వాటి నుండి పైన చెప్పిన వాసనలు మాత్రం రావు. అందుకే వాటికి ఆరోగ్యం సిద్ధిస్తుంది. వాటికి జీవితంలో అవయవాలు చెడిపోతాయని గాని, వయసుతో పాటు జబ్బులు వస్తాయని గాని, వారసత్వం గురించిగాని వాతావరణ కాలుష్యం గురించి గాని భయం లేదు. వాటిలోపల నున్న పరిశుభ్రత ఆ జీవులకు ఆ అభయాన్ని ప్రసాదిస్తుంది. అదే మనమైతే లేచిన దగ్గర్నుండీ పడుకునే వరకూ అన్ని చోట్ల ఎన్నోసార్లు కడుగుతూనే ఉంటాము. అయినా వాసనలు తట్టుకోలేక పౌడర్లు, అత్తర్లు వాడుకుంటూ ఉంటున్నాము. ఇలా ఎంతకాలం పాటు? ఇప్పటికి ఎన్నాళ్ళ నుండి. ఇలా జరుగుతున్నది? ఇక జీవితాంతం ఇంతేనా? ఆలోచించండి.

మనలో పేరుకున్న కంపుకు మనమే బాధ్యులం కాబట్టి దాన్ని వదిలించుకుని శుభ్రం చేసుకునే బాధ్యత కూడా మనదే కావాలి. మన అలవాట్లు మంచిగా ఉంటే చాలు, అదే శుభ్రం అయిపోతుంది. మురుగువాడల్నే నందనవనంగా మార్చే మనిషికి బారెడు శరీరాన్ని మంచిగా మలుచుకోవడానికి మనసుంటే చాలు.

ఇలాంటి పరిశుభ్రత మీ శరీరంలో వచ్చేటట్లు చేయడానికి రోజుకు 4, 5 లీటర్లు నీళ్ళు త్రాగడం, ఒకట్రెండు సార్లు సాఫీగా విరేచనానికి వెళ్ళడం, ఎంతో కొంత వ్యాయామం చేయడం, ప్రకృతి సిద్ధమైన ఆహారం తినడం, మాంసాహారాన్ని తగ్గించడం చెయ్యండి. త్వరలో మీరు అలాంటి పరిశుభ్రతను అనుభవించ గలరని ఆశించవచ్చునేమో!

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది     ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

46 - 48 మేము[41] మూసాను మా నిదర్శనాలతో పాటు,[42] ఫిర్ఔన్, అతని పరిపాలనాధికారుల వద్దకు పంపాము. అతను వెళ్ళి, నేను సకల లోకప్రభువు పంపిన సందేశహరుణ్ణి అని చెప్పాడు. తరువాత అతను మా నిదర్శనాలను వారి సమక్షంలో ప్రదర్శించినప్పుడు వారు వికటాట్టహాసం చేశారు. మేము ఒకదానిని మించిన మరొక ఘనమయిన నిదర్శనాన్ని వారికి చూపిస్తూ పోయాము, మరి మేము వారిని యాతనలో పట్టుకున్నాము, వారు తమ వైఖరిని మానుకోవాలని.[43]

41. ఈ గాథను ఇక్కడ మూడు ఉద్దేశాలతో వివరించడం జరిగింది. ఒకటి, పరమ ప్రభువు ఒక దేశం, ఒక జాతిలో తన ప్రవక్తను పంపించినప్పుడు, నేడు మహనీయ ముహమ్మద్ (స) ఆవిర్భావం తరువాత అరబ్బులకు అనుగ్రహించినట్లు, ఆ జాతికి అవకాశాన్ని ప్రసాదిస్తాడు. వారు దానికి విలువనివ్వ డానికి, దానిద్వారా ప్రయోజనం పొందడానికి బదులు, ఫిర్ఔన్ అతని జాతి చేసిన తెలివితక్కువ పని చేస్తుంది. అప్పుడు సంభవించే అంతమ పరిణామం, చరిత్రలో గుణపాఠం గరిపే ఉదాహరణగా రూపొందింది. రెండవది, ఫిర్ఔన్ కూడా తన రాచరికం, తన ప్రాభవ వైభవాలను, సంపదలను, మహత్తును గురించి గర్వం ప్రదర్శించి మహనీయ మూసా (అ)ను హీన మయిన వారిగా భావించాడు. అలాగే నేడు ఖురైష్ తిరస్కారులు తమ నాయకులకు సదృశంగా మహనీయ ముహమ్మద్ (స)ను అల్పులుగా భావిస్తున్నారు. కాని దైవ నిర్ణయం వేరయినది. దానివల్ల కడకు తేలిపోయింది నిజానికి అల్పులయిన వారెవరో. మూడవది, పరమ ప్రభువు అల్లాహ్ వచనాల ఎడల పరిహాసం చేయడం, దాని హెచ్చరికల పట్ల మొండితనం చూపడం ఏ విధంగానూ అగ్గువయిన బేరం కాదు, ఈ బేరం చాలా ప్రియంగా పరిణమిస్తుంది. దీని శాస్తిని అనుభవించిన వారి ఉదాహరణ ద్వారా గుణపాఠం గ్రహించకపోతే అదే శిక్ష అనుభవించి తీరవలసి ఉంటుంది.

42. నిదర్శనాలని అంటే, ప్రారంభ సూచనలని అర్థం. మూసా (అ) వాటితో పాటే ఫిర్ఔన్ దర్బారులోకి వెళ్ళారు. అంటే చేతికర్ర, మెరిసే చెయ్యి అన్నమాట. (వివరాలకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం. 3, అల్ ఆరాఫ్ : పాదసూచికలు 87-89 సం. 4,తాహా: పాద సూచికలు 12,13,29,30 సం. 5, అష్ షు'అరా: పాదసూచికలు 26-29 అన్ నమ్ల్: పాద సూచి 16 సం. 6, అల్ కసస్ : పాద సూచికలు 44, 45).

43. ఇక్కడ నిదర్శనాలని అంటే, తరువాత అల్లాహ్ హజ్రత్ మూసా ద్వారా వారికి చూపించిన సూచనలని భావం. అవి:

(1) మంత్రగాళ్ళతో దైవప్రవక్త బహిరంగంగా పోటీపడ్డారు. మంత్రగాళ్ళు ఓడిపోయి విశ్వసించారు. వివరాలకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం (సం. 3, అల్ ఆరాఫ్: పాద సూచికలు 88-92; సం. 4,తాహా:పాద సూచికలు 30-50; సం. 5, అష్ షు'అరా: పాద సూచికలు 29-30).

(2) మహనీయ మూసా (అ) భవిష్యవాణి ప్రకారం, ఈజిప్ట్ భూభాగంలో తీవ్రమయిన కరవు ఏర్పడింది. అది ఆయన ప్రార్థన మూలంగానే ముగిసింది.

(3) ఆయన ముందుగానే ప్రకటించిన విధంగా, దేశం మొత్తాన భయంకరమయిన వర్షాలు, మంచుతుఫానులు, ఉరుములు, మెరుములు, గాలి దుమారాలు సంభవించాయి. వాటివల్ల గ్రామాలు, పంటపొలాలు అన్నీ సర్వనాశనమయ్యాయి. ఈ విపత్తు కూడా ఆయన ప్రార్థన వల్లనే దూరమయింది.

(4) ఆయన ప్రకటన రీత్యానే దేశం మొత్తాన మిడతల దండులు భయానకంగా దాడి చేశాయి. ఈ విపత్తు సయితం, ఆయన దైవాన్ని ప్రార్థించనంత వరకు తొలిగిపోలేదు.

(5) ఆయన ప్రకటన ప్రకారమే దేశం మొత్తాన పేలు, (పశువుల బొచ్చులో పుట్టే) పురుగులు సర్వత్రా వ్యాపించాయి. వీటివల్ల పశువులు మానవులూ తీవ్ర బాధకు గురయ్యారు. వాటితో పాటు ధాన్యాగారాలు సర్వనాశనమయి పోయాయి. ఈ యాతన తొలగటానికి కూడా మహనీయ మూసా(అ)ను అభ్యర్థించి ప్రార్థన చేయించడం జరిగింది.

**(43వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ
## 4. యుద్ధాల ప్రకరణం
(కితాబుల్ మగాజీ)

అధ్యాయం : 2

## బద్ర్ సంగ్రామంలోని హతుల గురించి ప్రవక్త మహనీయుని (స) భవిష్యవాణి[1]

**575)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) గారు, హజ్రత్ సాద్ బిన్ ముఆజ్(రజి) ద్వారా ఉటంకించారు–సాద్(రజి) ఇలా అన్నారు: ఈయన (అజ్ఞాన కాలం నుండే) ఉమయ్యా బిన్ ఖలఫ్‌కు స్నేహితుడు. ఉమయ్యా బిన్ ఖలఫ్ ఎప్పుడు మదీనా నగరం మీదుగా (వర్తకం కొరకు) సాగిపోయినా ఈయన దగ్గరే ఆగేవాడు. అదే విధంగా సాద్ (రజి) మక్కా నగరం మీదుగా సాగిపోయినప్పుడు, ఉమయ్యా వద్ద ఆగేవారు.

దైవప్రవక్త(స)మదీనాకు హిజ్రత్ చేసి వచ్చిన తరువాత సాద్(రజి) ఒకసారి ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో మక్కా వెళ్ళారు. ఆనవాయితీ ప్రకారం ఉమయ్యా దగ్గరే ఆగారు. ఆ సందర్భంగా ఆయన ఉమయ్యాతో, “జనులు ఉండని సమయం ఏదో చెప్పు. నేను కాబా గృహాన్ని సందర్శించి ‘తవాఫ్’ (ప్రదక్షిణ) చేసుకుంటాన”ని చెప్పారు. అతను సాద్‌ను మిట్ట మధ్యాహ్నం వేళ వెంటబెట్టుకుని వెళ్ళాడు. దారిలో అబూ జహల్ తారసపడి, “అబూ సఫ్వాన్! నీ వెంట ఉన్న ఇతగాడు ఎవడు?” అని అడిగాడు. “ఇతను సాద్ బిన్ ముఆజ్”–చెప్పాడు ఉమయ్యా. దానికి అబూజహల్, “నీవు మక్కాలో నిక్షేపంగా తవాఫ్ చేసుకోవడాన్ని నేను సహించలేను. ఎందుకంటే మీరు ధర్మవిహీనులకు రక్షణ కల్పించారు. దైవసాక్షి! నువ్వు ఈ క్షణంలో అబూ సఫ్వాన్ (ఉమయ్యా) వెంట ఉండబట్టి సరిపోయింది. లేకుంటే, నీవు నీ ఇంటికి క్షేమంగా చేరుకునేవాడివి కావు” అన్నాడు. సమాధానంగా సాద్(రజి)ఇలా అన్నారు– ఆ క్షణంలో ఆయన హెచ్చు స్వరంతో మాట్లాడారు– “దైవ సాక్షిగా చెబుతున్నాను. ఈ రోజు నీవు గనక నన్ను తవాఫ్ చేయకుండా అడ్డుకున్నావంటే, నేను కూడా మదీనా మీదుగా నిన్ను ముందుకు పోనివ్వను, అది నీ పాలిట చాలా గడ్డు సమయంగా ఉంటుంది, జాగ్రత్త!” ఉమయ్యా మధ్యలో కల్పించుకుని, “సాద్! అబుల్ హకమ్ (అబూజహల్) ముందు బిగ్గరగా మాట్లాడకు. ఇతను ఈ మక్కా లోయకు నాయకుడు” అన్నాడు. కాని సాద్(రజి) ఏమాత్రం జంకకుండా, “ఉమయ్యా! చాలించు నీ అధిక ప్రసంగం. అబూ జహల్‌ను వెనకేసుకుని రాకు. నీవు వారిచేత (దైవప్రవక్త, ఆయన సహచరుల చేత) వధించబడతావని దైవప్రవక్త(స) చెప్పగా నేను విని

ఉన్నాను” అన్నారు. దానికి ఉమయ్యా, “ఏమిటి, మక్కాలో నన్ను హతమారుస్తారటనా?” అని అడిగాడు. “ఎక్కడ హతమారుస్తారనేది నాకు తెలీదు (కాని నిన్ను హతమారుస్తారని మాత్రం చెప్పారు) అన్నారు సాద్. ఈ మాట విని ఉమయ్యా భయాందోళనకు గురయ్యాడు. ఇంటికి రాగానే (తన భార్యతో) “చూశావా ఉమ్మె సఫ్వాన్! సాద్ నా గురించి ఏమంటున్నాడో?” అన్నాడు. “ఏమంటున్నాడేమిటి?” అడిగింది భార్య. “ఏదో ఒక రోజు ముహమ్మద్(స) నన్ను చంపేస్తారట! ఈ విషయం సాద్(రజి)కు చెప్పారట! మక్కాలో నన్ను చంపుతారటనా? అని నేనడిగాను. ఆ సంగతి తనకు తెలీదని సాద్ అంటున్నాడు. దైవసాక్షి! ఇక నుంచి నేను మక్కా విడిచి ఎక్కడికీ వెళ్ళను” అన్నాడు ఉమయ్యా.

తరువాత బద్ర్ యుద్ధ సందర్భంగా ఖురైషులలో సమరోత్సాహం కలిగించేందుకు బయలుదేరమని ఉమయ్యా బిన్ ఖలఫ్‌ను కోరాడు అబూ జహల్. కాని ఉమయ్యా మాత్రం యుద్ధంలో పాల్గొనడానికి సుముఖత చూపలేదు. అయితే అబూ జహల్ అతని దగ్గరకు వచ్చి, “చూడు అబూ సఫ్వాన్! నీవు ఈ లోయకు సర్దారువి. ఒకవేళ నువ్వే రాకపోతే సామాన్య ప్రజలు కూడా యుద్ధానికి రాక పోవచ్చు” అన్నాడు. ఆ విధంగా అబూ జహల్ పలుమార్లు చెప్పి అతి కష్టమ్మీద ఉమయ్యాను ఒప్పించగలిగాడు. గత్యంతరం లేని పరిస్థితిలో ఉమయ్యా “మక్కాలోనే అరుదైన, వేగవంతమైన ఒంటెను కొంటాను” అన్నాడు. తరువాత ఉమయ్యా తన భార్యతో, “ఉమ్మె సఫ్వాన్! నా సామాను సర్దు” అని పురమాయించాడు. దానికి ఆమె, “అయ్యో! అబూ సఫ్వాన్! నీ యస్రిబ్ స్నేహితుడు చెప్పిన మాటను మరచిపోయావా?” అంది. “మరువలేదు. వీళ్ళ వెంట కొంత దూరం మాత్రమే వెళ్ళి, తిరిగి వస్తాను” అని భార్యకు ధైర్యం చెప్పాడు ఉమయ్యా. ఆ విధంగా ఉమయ్యా అన్యమనస్కంగా బయలుదేరాడు. దారిలో ఎక్కడ విడిది చేసినా వేగంగా పరుగెత్తే తన ఒంటెను తన దగ్గర్లోనే కట్టి ఉంచేవాడు. ఆ విధంగా చివరి క్షణం వరకు అతను జాగ్రత్తలు తీసుకున్నాడు. కడకు అల్లాహ్ అతని కథను సమాప్తం చేయించాడు.[1]

2-1. ఈ అధ్యాయం క్రింద ఇమామ్ ముస్లిమ్ పొందుపరచిన ఉల్లేఖనం మరింత స్పష్టంగా ఉంది. దాని ప్రకారం బద్ర్ యుద్ధం మొదలవక ముందే దైవప్రవక్త(స) తన సహచరుడైన ఉమర్(రజి)తో, ఏ అవిశ్వాసి ఏ స్థలంలో వధించబడతాడో చెప్పేశారు. ఉమర్ (రజి) ఇలా అన్నారు : ''దైవప్రవక్త(స) ఏ ఏ స్థలంలో ఏ ఏ సత్య తిరస్కారి వధించబడతాడని సూచించారో ఆయా స్థలాలలోనే వారు హతులయ్యారు''- ఇది దైవప్రవక్త(స) అద్భుతాలలో ఒకటి.

575-1. ఉమయ్యా బద్ర్ యుద్ధ రంగానికి వెళ్ళడానికి ఏ మాత్రం సుముఖంగా లేడు. కాని అబూ జహల్ అతన్ని లాలించి, బుజ్జగించి ఒప్పించాడు. ఆ విధంగా ఉమయ్యా వధకు- ఒక విధంగా- అబూ జహల్ కూడా కారకుడయ్యాడు.

ముహమ్మద్(స) చెప్పిన మాట అక్షర సత్యం అవుతుందన్న సంగతి ఉమయ్యాకు తెలుసు. క్లిష్ట సమయంలో పలాయనం చిత్తగించేందుకు వేగంగా పరిగెత్తే ఒంటెను కూడా కొనుగోలు చేశాడు. కాని అతని ముందు జాగ్రత్తచర్యలు ఏవీ పనికిరాలేదు. బద్ర్ యుద్ధ మైదానంలోనే హజ్రత్ బిలాల్ (రజి) చేత వధించబడ్డాడు. ఒకప్పుడు ఉమయ్యా మక్కాలో హజ్రత్ బిలాల్ (రజి)ను నానా విధాలుగా హింసించాడు.


★★★

'చరితార్థులు'-2



# కెప్టెన్ ముహమ్మద్ అక్రం

( -1942)



55

ప్రథమ 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటులో ప్రముఖపాత్ర పోషించిన కెప్టెన్ ముహమ్మద్ అక్రం ప్రస్తుత పాకిస్తాన్‌లోని లాహోర్ ప్రాంతంలో జన్మించారు. ద్వితీయ ప్రపంచ యుద్ధం సందర్భంగా బ్రిటిష్ భారత సైన్యంలో అధికారిగా మలయా వెళ్ళిన ఆయన అక్కడి పరిణామాల నేపథ్యంలో 1940లో సహచరుడు కెప్టెన్ మోహన్ సింగ్‌తో కలసి మాతృభూమిని ఆంగ్లేయుల పెత్తనం నుండి విముక్తి చేయడానికి నడుంకట్టారు. ఆనాడు మలయా కేంద్రంగా భారతీయ విప్లవోద్యమాన్ని నడుపుతున్న జ్ఞాని ప్రీతం సింగ్, జపాన్ సైన్యాధికారి మేజర్ ఇవాయ్‌చి ఫూజిహారాలతో సంప్రదింపుల తరువాత భారత జాతీయ సైన్యం ఏర్పాటుకు కెప్టెన్ మోహన్ సింగ్ ఒక నిర్ణయానికి రావడానికి కెప్టెన్ అక్రం తోడ్పడ్డారు. తూర్పు ఆసియాలోని థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ కేంద్రంగా ప్రీతం సింగ్ నేతృత్వంలో పని చేస్తున్న విప్లవోద్యమ సంస్థ 'ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్' కార్యక్రమాలకు కెప్టెన్ అక్రం చేయూతనిచ్చారు. జపాన్ సైన్యాలకు యుద్ధ ఖైదీలుగా చిక్కిన భారతీయ సైనికులలో దేశభక్తిని ప్రోదిచేస్తూ, బ్రిటిష్ వ్యతిరేకతను మరింతగా పెంపుచేస్తూ 'సైనిక ప్రాపగాండ' కార్యక్రమాలను కెప్టెన్ ముహమ్మద్ అక్రం చురుగ్గా నిర్వహించారు. భారత జాతీయ సైన్యం ఏర్పాటు, బ్రిటిష్ భారత సైనిక బలగాలతో జరిగే పోరాటంలో భారత జాతీయ సైన్యం పాత్ర, జపాన్ ప్రభుత్వం, జపాన్ సైన్యాధికారుల సహకారం గురించి జపాన్ ప్రభుత్వాధినేతల నుండి స్పష్టమైన హామీలు, సమాధానాలను రాబట్టేందుకు 1942 మార్చి తొమ్మిదిన సింగపూర్‌లో జరిగిన సమావేశంలో కెప్టెన్ అక్రం చురుగ్గా పాల్గొన్నారు. ఆ తరువాత 1942 మార్చి 28న టోకియోలో జరగనున్న సమావేశానికి కెప్టెన్ సింగ్, కెప్టెన్ అక్రం కలసి 'భారత జాతీయసైన్యం' వ్యవస్థాగత రూపురేఖలను, లక్ష్యాలను, నిర్దేశిస్తూ ఒక డాక్యుమెంటును రూపొందించారు. జపాన్ రాజధాని టోకియో సమావేశానికి హాజరయ్యేందుకు సహచరులతో కెప్టెన్ ముహమ్మద్ అక్రం 1942 మార్చి 11న టోకియోకు ప్రయాణం కట్టారు. కెప్టెన్ అక్రం బృందం బయలుదేరిన విమానం మార్గమధ్యంలో 1942 మార్చి 24న ప్రమాదానికి గురయ్యింది. ఈ విమాన ప్రమాదంలో తొలి భారత జాతీయ సైన్యం ఏర్పాటులో ప్రముఖపాత్ర వహించిన భారత స్వాతంత్ర్య సమరయోధులు కెప్టెన్ ముహమ్మద్ అక్రం అదృశ్యం అయ్యారు. ఈ విషాద సంఘటన నేపథ్యంలో థాయిలాండ్, మలయా, బర్మా తదితర దేశాలలో ఉంటున్న ప్రవాస భారతీయులు, విప్లవకారులు ప్రత్యేకంగా సభలు, సమావేశాలు నిర్వహించి భారత జాతీయ సైన్యం యోధులు కెప్టెన్ ముహమ్మద్ అక్రం మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ ఘనంగా నివాళులు అర్పించారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




## విశ్వాస పరిమళమద్దిన ఖాజావలి పద్యకావ్యం

# “అల్లాహ్ సందేశం”

-కవి కరీముల్లా

**తెలుగు భాషలో** ప్రాచీన సాహిత్యం నుండి నేటి ఆధునిక సాహిత్యం వరకు ఎన్నో వైవిధ్యాలు కొనసాగాయి. వచన కవిత్వం ఎంతగా విజృంభించినా పద్యకవిత్వం ఎప్పుడూ తన ఉనికిని, అస్తిత్వాన్ని ఖాజావలి వంటి కవుల రూపంలో నిలబెట్టుకుంటూనే ఉంది. ఈ కవికి ప్రాచీనత నుండి ఆధునికతలోకి దృష్టిని సారించగల అంతర్‌నేత్రం ఉంది. ఈ అల్లాహ్ సందేశం తెలుగు పద్య సాహిత్యంలో విశ్వాస పరిమళాలు అద్దిన గొప్ప పద్యకావ్యంగా నిలుస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో కవి వస్తువును ఎంచుకున్న తీరు శిల్పగాఢత పుస్తకానికి వన్నె తెచ్చాయి. పద్యం పఠితులకు అందకుండా ఆకాశ మార్గంలో విహరిస్తుందనే అపోహలను పటాపంచలు చేస్తూ పద్యం తేలి పోకుండానే ఈ అక్షరాలు అర్థవంతమైన భాషలో పాఠకుని ఆకట్టు కుంటాయి. షేక్ ఖాజావలి స్వస్థలం కండ్రిక. ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా. వీరి తల్లిదండ్రులు షేక్ మీరా సాహెబ్, హస్సన్బి గార్లు, తెలుగు భాషోపాధ్యాయునిగా పని చేస్తూ, తెలుగు కవిగా పుస్తకాలు రాసి తెలుగు భాషాభివృద్ధికి ఇతోధికంగా కృషి సల్పారు. తెలుగు పద్యాన్ని అత్యంత హృద్యంగా చెప్పడంలోనూ, భాషకు భావుకతను జోడించి రాయడంలోనూ కవి ఖాజావలి దిట్ట. సుమారు 1500 సంవత్స రాల క్రితం మక్కాలోని హీరా గుహలో పవిత్ర ఖురాన్ తొలి సూరా అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స) మనోఫలకంపై దైవదూత జిబ్రాయిల్ ద్వారా ఆవిష్కృతమైంది. నాటి నుండి అనేక వత్సరాలుగా వెలువడిన ఈ దైవవాణి అంతిమ దైవ గ్రంథంగా మానవాళికి ఋజుమార్గాన్ని చూపించింది. మనిషికి సంబంధించిన సమస్త రంగాలను స్పృశించి మానవాళికి దిశానిర్దేశం చేసిన దివ్యగ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్. అట్టి మహత్తర గ్రంథంలోని సారాంశాన్ని విడమర్చి పద్యరూపంలో చెప్పడం సామాన్యమైన విషయమేమి కాదు. పవిత్ర ఖురాన్ పట్ల ఎంతో లోతైన అవగాహన, తెలుగు భాషపై పట్టు, సాధికారత ఉంటేనే అది సాధ్యమౌతుంది. ఈ పుస్తకంలో అల్లాహ్ కరుణను, ఘనతను స్తుతిస్తూ కవి రాసిన అనేక పద్యాలు కవికి అల్లాహ్ పట్ల ఉన్న భక్తి ప్రపత్తులు తెలియజేస్తాయి. దేవుని ప్రేమలో తనను తాను పరవశించి రాసిన పద్యరత్నాలివి.

“వేయని పందిరై విరిసిన గగనము వేడుక జేసిన వేల్పు యెవరు గగనాన మేఘాల గమనాలు మారుచు వర్షాలు కురిపించు వారు యెవరుదివ్య వెలుంగుల దేదీప్యమందించు సూర్యచంద్రాదుల శోభ యెవరు కన్నులు గాంచని కమ్మని వాయువు ప్రాణాలు నిల్పిన ప్రభువు యెవరు”.

అంటూ నయనానందకరంగా ప్రకృతిని సృష్టించిన నిజప్రభువు అల్లాహ్‌ను ఖాజావలి స్తుతించారు. ఈ పుస్తకంలోని ప్రతి పద్యం లోను సందర్భోచితమైన ఓ సార్వకాలికమైన సత్యముంది. అనేక అగోచర విషయాలను సంప్రదాయ పద్య నియమాలు పాటిస్తూనే చెప్పిన గొప్ప సందేశాల దృగ్గోచరముంది. ఖాజావలి గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు కావడం వలన గ్రామీణ జీవితంలోని ధ్వని తెలుసు. కనుకే తన పద్యంలో గొప్ప మిసిమితో కూడిన రస సిద్ధాంతం ఓ ప్రవాహంలా జాలువారుతుంది. మనిషి తను పోగొట్టుకున్న తావుల్ని జ్ఞప్తి చేస్తూ అల్లాహ్ సత్యమార్గాన్ని యెఱుక పరుస్తాయి. అసహజమైన ఆత్మీయతల స్థానే సహజమైన ప్రేమానురాగాలు నింపుతాయి. దైవం సృష్టించిన ప్రకృతి అందర్నీ సమంగా చూస్తుంది. దానికి ఎటువంటి కుల, మత, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉండవు. కాని మనిషే మనిషిని మింగాలను కుంటాడు. తృణప్రాయమైన ఐహిక జీవితం కోసం ఎన్నో నేరాలు ఘోరాలు చేస్తుంటాడు. గాలిపటానికి సూత్రం ఉండాలి. అప్పుడే అది సక్రమంగా ఎగరగలుగుతుంది. సూత్రం లేని గాలిపటం అటు ఇటు ఎగిరి ఏ చెట్టు కొమ్మకో చిక్కి చిరిగిపోతుంది. మనిషి జీవితం అంతే. ఏ సూత్రంలో మనిషి జీవితం నిర్విఘ్నంగా ముందుకు సాగగలదో ఈ పుస్తకం చెబుతుంది. పవిత్ర ఖుర్‌ఆన్ అనేక దృష్టాంతాలను విడమర్చి చెప్తూ దైవప్రవక్తల మాటలు వినని జాతులు ఎలా పతనమొందాయో వివరిస్తుంది. నిజానికి ఇస్లాం అంటే మతం కాదు. మానవాళికి దైవం చూపిన ఓ జీవన విధానం. ఇందులో బలవంతం ఏమి లేదు.

"ధర్మం విషయంలో బలాత్కారానికి తావులేదు" అని పవిత్ర ఖుర్‌ఆన్ చెబుతుంది. మనిషి దైవమార్గాన పయనిస్తాడా సైతాన్ మార్గాన పయనిస్తాడా అనేది అతనికి స్వేచ్ఛ ఇవ్వబడింది. తీర్పు దినాన తీర్పరి అల్లాహ్. ముస్లిం అంటే కూడా ఒక జాతి పేరు కాదు, దైవ విధేయుడు అనే తెలుగు అర్థం వస్తుంది. నిజమైన ముస్లిం విశ్వమానవ ప్రేమను విశ్వసిస్తాడు. అన్యాయంగా ఏ మనిషికీ హాని తలపెట్టడు. మానవులంతా పరస్పరం సోదరులే అనే పవిత్ర ఖుర్‌ఆన్ సారాంశాన్ని ఆవాహన చేసుకొని ఆ సృష్టికర్తకే తలవంచి సమస్త సృష్టిని ప్రేమిస్తాడు. ఇట్టి విశ్వాస మాధుర్యాన్ని గ్రోలిన తుమ్మెదల వలె ఖాజావలి పద్యాలు అక్షర మకరందాలై మురిపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దుష్టశక్తులు తమకున్న అన్ని వనరులతో ఇస్లామోఫోబియా ఇబ్బడిముబ్బడిగా వ్యాపింపజేస్తున్న ఈ తరుణంలో ఖాజావలి వంటి కవుల అవసరం ఎంతైనా ఉంది. ఆకులు రాల్చే కరకు శిశిరాల్ని పారద్రోలి వసంతగాలులు వ్యాపింపజేయాలంటే "అల్లాహ్ సందేశం" వంటి పుస్తకాల తోరణాలు కట్టాల్సిందే.

"సకల చరాచర సంభ్రమ సృష్టిని సమదృష్టి తోడనే సలిపినాడు. సకల జీవుల నెల్ల చక్కగా బుట్టించి మనిషి నున్నతిగా మలచి నాడు సకల ధర్మంబుల సౌశీల్యత నెరింగి సద్బుద్ధి నొసగెను సహజధనుడు. సకల భూమండల సౌలభ్యముగ నిల్పి చక్కటి భ్రమణాన చక్కదిద్దె"

అంటూ దైవానికి సమదృష్టి ఉందని, మానవులే అక్రమ దృష్టితో జీవిస్తున్నారని వ్యంగ్యాత్మకంగా కవి చమత్కరించారు. పుట్టుక రీత్యా ఎవరూ అధికులు, అల్పులు కాదని దైవప్రవక్త (స) చెప్పారు.

ఈ ప్రకృతిలోని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, చెట్లు, చేమలు, కొండలు అన్ని ముస్లింలే. దైవాజ్ఞ ప్రకారం అవి నడుచు కుంటాయి. జన్మించే ప్రతి మానవుడు ముస్లిమే అని ఇస్లాం చెబుతుంది. మనిషి జన్మించాక తన కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం అతన్ని విశ్వప్రభువుకు దూరం చేయవచ్చు. దగ్గర చేయ వచ్చు. కానీ అంతరాత్మ మాత్రం ఆ సృష్టికర్త ఒక్కడేనని, అతని పుట్టుక, చావు, రూపంలేని వాడని చెప్తూనే ఉంటుంది. అతను అంతరాత్మ ఘోషను పట్టించుకోవచ్చు, విస్మరించనువచ్చు. ఈ స్వేచ్ఛ మనిషికి ఇవ్వబడింది. కవి ఖాజావలి ఓ పద్యంలో అల్లాహ్ ను గురించి ఇలా ప్రస్తుతించారు:

"పుట్టుకిచ్చువాడే గాని పుట్టబోడు మరణమిచ్చును, పొందడు మరణమేను నిదురఁగల్పించునే గాని నిదురబోడు ఆకలిని దీర్చు నాహారా మందబోడు"

పవిత్ర ఖుర్‌ఆన్లో అల్ ఇఖ్లాస్ సూరాలో అవిశ్వాసులకు, బహు దైవారాధకులకు దైవం గురించి వివరణ ఇవ్వబడింది. ఆ వివరణ లోని కొంత భాగం యొక్క భావాన్ని కవి పద్య రూపంలో వెలయించడం ముదావహం. కలిమా (సద్వచనం) **"లాయిలాహ యిల్లల్లాహ్, ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** పఠించడమంటే మనిషి తన ప్రభువును ఒక్కడే అని ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని మనసా, వాచా, కర్మణా విశ్వసించడం కనుకే నిజమైన ముస్లిం భూమిపై ఆకాశంలోని ఏ ప్రకృతి శక్తికీ సాగిలపడడు. ఒక్క అల్లాహ్ (అరబీలో దైవం) ముందు మాత్రమే తలవంచు తాడు. ఇస్లాం యొక్క ఈ గొప్పతనాన్ని గురించి ఎడ్వర్డ్ గిబ్బన్ "హిస్టరీ ఆఫ్ సారాసిక్ ఎంపైర్"లో ఇలా ఇస్లాం స్వీకరించడానికి బుద్ధి గ్రాహ్యమైన దైవ స్వరూపాన్ని సారూప విగ్రహం ద్వారా కించపర్చడమన్నది ఎన్నడూ జరుగదు. ప్రవక్తకు ఇచ్చే గౌరవాదర ణలు ఉత్తమ మానవ ప్రమాణాలను ఎన్నడూ మించి పోలేదు. ఇదే ఇస్లాం గొప్పదనం" అంటాడు.

పవిత్ర ఖురాన్లోని స్త్రీలకు సంబంధించి అనేక హక్కులు చెప్పబడ్డాయి. అన్ నిసా అధ్యాయంలోని పదకొండో సూరాలో స్త్రీల ఆస్తి హక్కుకు సంబంధించిన సూచనలున్నాయి. ఈ ఆధునిక యుగంలో మనం స్త్రీల హక్కుల గురించి మాట్లాడు కుంటున్నాం. కాని పవిత్ర ఖుర్‌ఆన్లో 1500 సం॥ల క్రితమే ఈ హక్కులు ప్రసాదించబడ్డాయి. కవి ఖాజావలికి ఖురానే షరీఫ్ పట్ల సమగ్రమైన అవగాహన ఉంది. తన పద్యాలలో ఇలా ఉదహరించాడు:

ఆధునిక యుగాన ఆస్తి హక్కులనిచ్చి పడతి జీవితాన బలము గూర్చె ఇంతి భాగమిచ్చే యెప్పుడో యల్లాహు తాల ఇల ఖురాను తరలిరాగ,

అని ఎంతో రమ్యంగా చెప్పడం కవి పాండిత్య ప్రతిభకు ఒక నిదర్శనం. తెలుగు భాష అత్యంత మధురమైనది. పద్యకవిత్వ మంటేనే అది ఛందోబద్ధ కవిత్వం. ఛందోబద్ధ కవిత్వంలోనూ మార్గదేశి ఛందస్సులుంటాయి. కవి ఖాజావలి తెలుగు పండితుడు కూడా కావడం వల్ల ఆయన పద్యాన్ని ప్రేమించాడు. ఆ ప్రేమను తుచ్ఛమైన ఐహిక కోర్కెల మీద, పొగడ్తల మీద గాక దైవంపై ప్రేమగా మలచి, ఈ పద్య తోరణాలు తెలుగు సాహిత్యంలో కట్టడం ఆయన మనో పరిణతిని తెలియజేస్తుంది. ఎందుకంటే దైవం మనిషిపై చూపే ప్రేమే నిజమైన ప్రేమ. అది శాశ్వతమైనది. అనంతమైనది. ఈ సత్యాన్ని గ్రహించడం వల్లే కవి కలం నుండి ఈ **"అల్లాహ్ సందేశం"** అనే పుస్తకం వచ్చింది. ఒక వ్యక్తి లేదా ఒక సమాజం యొక్క స్థితిగతుల్ని ఆర్థిక విష యాల్ని ప్రభావితం చేస్తాయి. పెట్టుబడిదారీ సమాజానికి వడ్డీ అనేది ఊపిరి వంటిది. దీన్ని ఇస్లాం నిషేధించింది. మనిషిని పీడించి శ్రమను దోచుకునే సకల సమాజ విరుద్ధమైన పద్ధతుల్ని నిషేధించింది. మార్కెట్ గుత్తాధిపత్యం, ఆర్జన కానీ నిర్ణీత ఆదా యాలు, అదనపు రాబడి అక్రమ నిల్వలు తదితర విషయాలను తిరస్కరించడం ద్వారా పవిత్ర ఖుర్‌ఆన్ సమ సమాజ స్థాపనకు దోహదం చేసింది. ఇందులో వడ్డీ అనేది ఎంత ప్రమాదకారో

కవి ఖాజావలి పద్యంలో...

రాబడి హెచ్చుపర్చుటకు రాక్షస రీతిని వడ్డి రాబట్టున్ రాబడి మూడు రెట్లకును రక్కగ బట్టెను రవ్వలందునే లోబడి దానధర్మ ముల లోక శుభంబుల జేయువారలున్ రాబడి జూడకే యిలను రాసులు కాసుల(బంచి యిచ్చులే...

అని వడ్డీ తినేవారి మానసిక స్థితిని వర్ణించారు. అయితే కొందరు పేదసాదల బాధల నెరిగిన వారు దానగుణం కలిగి ఉంటారనే సందేశం ఉంది. దీనిలో కవికి నేటి అసమ సమాజం పట్ల ఉన్న అసంతృప్తిని తెలిపారు. అంతేగాక పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు అనుగుణమైన మానవీయ సమాజం ఏర్పడాలనే కాంక్ష పట్ల భక్తి ప్రపత్తులు కలిగి ఉండి సమాంతరంగా సమాజపు హెచ్చు తగ్గులు, దైవం చూపిన పరిష్కారాలను తన పద్యంలో ఆవిష్క రించారు. సమర్థుడైన కవి రాసిన ఆత్మాశ్రయ గీతంలో కన్పించిన మార్మికతకు అంతర్లీనంగా ఒడిసి పట్టుకొని కవి పవిత్ర ఖుర్ఆన్ ఛాయలో సేద తీరుతున్నట్లనిపిస్తుంది. తెలుగు పద్యాలు అజరామరంగా నిలవడానికి "అల్లాహ్ సందేశం" వంటి పుస్తకాలే ప్రేరకాలు. ముందు పద్య వస్తువును ఎంచుకోవడం, తదుపరి అన్ని నియమాలు అనుసరిస్తూనే చెప్పదల్చుకున్న విషయం విషయం సూటిగా చెప్పడం కవికి విశిష్టత నిస్తుంది.

గ్రంథ వాక్యాల బోధించు కమ్మగాను మనసు దేనివు పట్లను మలచి నిలిపి సాటి వారిని మార్చగ సాయపడుము విముఖతను జూపు వారలు వేదనొందు...

అని దైవసందేశాన్ని సాటివారికి తెలియజేయడం ఒక ముస్లింగా తన బాధ్యత అని గుర్తెరిగి ఈ పుస్తకం తెస్తున్న కవి అభినందనీయులు దైవ సందేశాన్ని ఆఘ్రాణించని వారిపట్ల తిరస్కరించేవారి పట్ల ఆవేదన సైతం ఈ పద్యంలో కన్పిస్తుంది.

ఏది యేమైనా కవి ఖాజావలి జీవితం ధన్యమైంది. గడ్డకట్టిన మనసు కల్మషాల్ని కసుగాయలుగా రాల్చి దైవ ప్రేమలో పునీ తుల్ని చేయడమే కవి లక్ష్యం. సమాజంపై పంజా విసురుతున్న షైతాను ఆలోచనలను తరిమివేసి అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో మనిషి మహోన్నతుడుగా మారాలనే తపన ఈ రచనలో కన్పించింది. ఈ ప్రపంచీకరణ యుగంలో దైవ భక్తి నాటకీయంగా మారుతున్న ఈ మాయదారి కాలంలో నిజమైన భక్తిప్రపత్తులను నాటే "అల్లాహ్ సందేశం" వంటి పుస్తకాలు రావాలి. ఇట్టి ప్రయత్నంలో సఫలీకృతులైన కవి ఖాజావలి గారిని అభినందిస్తూ, ఆయనకు తన కలం నుండి మరెన్నో రచనలకు శ్రీకారం చుట్టే మహద్భాగ్యం ప్రసాదించాలని దుఆ చేస్తూ.... ❑




# తాగూత్ అని ఎవరినంటారు?

**మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మ)**

**దైవానికి ఎదురుగా ఒక దాసుని తలబిరుసుతనానికి మూడు దశలుంటాయి–**

- **మొదటి దశ:** దాసుడు సూత్రప్రాయంగా దైవాజ్ఞలను శిరసావహించడాన్ని సత్యంగా ఒప్పుకుంటాడు. కాని క్రియాత్మకంగా ఆయన ఆజ్ఞలను ఉల్లంఘిస్తాడు. దీనిని అవిధేయత, పాపం (ఫిస్ఖ్) అంటారు.
- **రెండవ దశ:** అతడు సూత్రప్రాయంగా దైవాజ్ఞా పాలనను తిరస్కరించి, తనను సర్వ స్వతంత్రుడుగా భావిస్తాడు. లేదా వేరితరుల దాస్యం చేయసాగుతాడు. దీనిని సత్య తిరస్కారం, అవిశ్వాసం (కుఫ్ర్) అంటారు.
- **మూడవ దశ:** అతడు దైవంపై తిరుగుబాటు చేసి స్వయంగా తన ఆజ్ఞను చెలాయించటం మొదలెడతాడు. ఈ వైఖరికి ఒడిగట్టిన వ్యక్తిని **'తాగూత్'** అంటారు.



**ఈ తాగూత్‌ను తిరస్కరించనంతవరకూ ఏ వ్యక్తీ నిజ భావంలో విశ్వాసి (మూ'మిన్) కాజాలడు.**

# పూల పాన్పు

- యం.ఏ ఆరిఫ్, కొత్తగూడెం

**జీవితం** ఎప్పుడూ పూల పాన్పు కాదు, జీవితంలో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు ఉంటాయి. జీవితం అనే ముళ్ళ బాటలో ఎన్నో సవాళ్ళు, ఎన్నో ఎత్తుపల్లాలు, ఎన్నో కష్టాలు, సమస్యలు ఉంటాయి. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఉంటాయి. అవాంతరాలు లేకుండా మనిషి జీవితం సాగదు. కానీ, వాటిని ఎదుర్కోవాలి. జీవితం అనేది ఎప్పుడు పూల పాన్పు కాదు. మనిషనేవాడు ఆనందంతో పాటు విషాదాన్ని కూడా చవి చూడాల్సిందే. పట్టుమని పాతికేళ్లు కూడా నిండని నా చిట్టితల్లి చావు నాకు విషాదమే. నవ్వుతూ, నవ్విస్తూ ఉండే నా చిట్టితల్లి ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోవడం నాకు తీవ్ర విషాదమే. పోయిన వాళ్ళతో పోలేము కాబట్టి ఈ జీవన యాత్ర బాధతో కొనసాగిస్తున్నాను.

ఈ సమాజంలో ఎంతమంది నిందించినా కానీ, ఓపికతో అన్నీ భరించాలి. అప్పుడే ఈ జీవితం పూల పాన్పు అవుతుంది. జీవితం అంటే, పూలతో పరిచి ఉంచిన పాన్పు కాదు.

పూల పాన్పు (స్వర్గం) కావాలంటే, ముళ్ళబాట (కష్టాలను ఓర్చుకొని)పై నడవక తప్పదు. ఓర్పు, నేర్పులతో సుఖ దుఃఖాలను, ఎన్నో కష్ట నష్టాలను దాచి, ఎన్నో వింతలు, విడ్డూరాలు, మరెన్నో అపజయాలను దాటుకొని విజయాల్ని సొంతం చేసుకొని నీ చివరి శ్వాసను విడిచి పెట్టడమే జీవితం. అలాగని జీవితం గులాబీలతో నిండిన ప్రయాణం కాదు.

ఎన్నో ముళ్ళను, ఇబ్బందులు ఎదుర్కొని నిలబడినది ఈ జీవితం. అందరికీ జీవితం పూల పాన్పు కాదు. పరిస్థితులు మన చేయి దాటిపోయినప్పుడు, నిరాశతో క్రుంగిపోవడం వలన, ఇతరులను నిందించడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. అలా కాకుండా తప్పొప్పులను చక్కగా విచారించుకొని విచక్షణతో సరైన మార్గాన్ని అనుసరిస్తే జీవితం పూల పాన్పు అవుతుంది. చిన్న తనంలో రేగికాయలు కోసేటప్పుడు ముళ్ళు గుచ్చుకోకుండా ధ్యాసతో, ఓపికతో తెంపేవాళ్ళం. మరి ఇప్పుడు ఇదే ధ్యాస, ఇదే ఓపిక మనిషిలో లేదు. అలాంటప్పుడు ఈ జీవితం పూల పాన్పు ఎలా అవుతుంది? ముళ్ళదారి అవుతుంది. ఈ ముళ్ళ దారిలో చాలా కష్టాలు, కన్నీళ్ళు ఉంటాయి. సవాళ్ళు, ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు వస్తుంటాయి. ఎంతో ఓపికతో జీవితం గడిపితేనే పూలపాన్పు (స్వర్గం) లభిస్తుంది. తల్లిదండ్రులు ముసలితనంలో ఉన్నప్పుడు వారిని చులకనగానో, భారంగానో భావించకండి. వారితో ఆప్యాయంగా, ప్రేమతో, దయతో, బాధ్యతతో మెలిగితే జీవితం పూల పాన్పు అవుతుంది. సానుకూల మనస్తత్వంతో మన తప్పుల నుండి పాఠాలు నేర్చుకుంటే జీవితం పూల పాన్పు అవుతుంది. పూల పాన్పు (స్వర్గం) కావాలంటే, ముళ్ళబాట (ఇహలోకంలో అన్ని అడ్డంకులను అధిగమించి) పై నడవక తప్పదు.

దైవం అందరికీ ఇహలోకంలో ఓపికతో జీవించే శక్తిని ప్రసాదించాలని కోరుకుందాం.

## కొత్త క్రిమినల్ చట్టాల వల్ల బడుగు వర్గాలకు, ముఖ్యంగా ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం : ఎంపిజె అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్



2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన పార్లమెంట్ సమావేశాలలో బలమైన కారణమేదీ లేకుండానే ప్రతిపక్షాలకు చెందిన 146 మంది పార్లమెంట్ సభ్యులను ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్రపూరితంగా సస్పెండ్ చేసి హడావిడిగా క్రిమినల్ చట్టాలకు సంబంధించిన మూడు బిల్లులను ప్రవేశపెట్టి, వాటి ఆమోదముద్ర కోసం రాష్ట్రపతికి పంపిందనీ, రాష్ట్రపతి ఆమోదం పొందాక, ఆ చట్టాలు ఇటీవల అమలులోకి వచ్చాయని ఎంపిజె తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. అందుకే ప్రముఖ న్యాయవాదులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు ఈ చట్టాల పట్ల ఆందోళన వ్యక్తపరిచారనీ, మరీ ముఖ్యంగా సమాజంలోని బడుగు వర్గాల వారిపై, ముస్లింలపై ఈ చట్టాలు తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈ చట్టాలను పునః పరిశీలించాలనీ, అన్యథా ఇవి ప్రజాబాహుళ్యంలో భయోత్పాతానికి కారణమవుతాయనీ, ఈ చట్టాల ఆసరాతో పోలీసులు నిర్దోషులను కూడా నిర్బంధించి, వారిని కేసులలో ఇరికించే ప్రమాదం ఉందనీ, ప్రస్తుతం దేశంలో కారాగారాలలో ఏండ్ల తరబడి మగ్గుతున్నవారిలో అత్యధిక మంది నిరుపేదలు, పీడితులు, కార్మికులేనని, వారు న్యాయం కోసం కోర్టుల్లో వాదించే స్థితిలో లేరని, వారి కుటుంబీకులకు పూట గడవటమే కష్టంగా ఉందని ఆయన ఒక పత్రికా ప్రకటనలో చెప్పారు. కాబట్టి ఈ కొత్త చట్టాలపై పునఃపరిశీలన చేసి, సముచితమైన సవరణలతో వాటిని తిరిగి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# విదేశీ ముద్ర వేయడం కుదరదన్న కోర్టు



అమ్రా

**కొన్నేళ్ళ క్రితం** యావద్దేశంలో పౌరసత్వ సవరణ చట్టం సిఏఏ చర్చలే వినిపించేవి. సిఏఏతో పాటు ఎన్నార్సీ, వాటికి సంబంధించిన క్రోనాలజీ గురించే మాటలు వినిపించేవి. షాహిన్ బాగ్ ఆందోళన చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఢిల్లీ నుంచి మొదలు దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రభుత్వంలోని పెద్దలు, మంత్రులు, బీజేపీ నేతలు అందరు ఎన్నార్సీ, సిఎఎ గురించే మాట్లాడేవారు. అసలు ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న ఏకైక సమస్య ఎన్నార్సీ, సిఏఏలు లేకపోవడమే అన్న స్థాయిలో వారి మాటలుండేవి. ఎన్నార్సీ సిఏఏలు వస్తే చాలు దేశం సుభిక్షమైపోతుందన్నట్లు ఊదరగొట్టేవాళ్ళు. దేశం ముందుకు పోవాలంటే వెనక నుంచి నెట్టడానికి ఎన్నార్సీ సీఏఏ అవసరమన్నట్లు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వాలు, నేతలు, పాలనాయంత్రాంగం, పోలీసులు ఎక్కడ చూసినా ఎన్నార్సీ, సిఏఏ తప్ప మరేమీ వినిపించలేదు. సిఏఏ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న చాలా మంది నిర్బంధాలకు గురయ్యారు. అనేకమంది జీవితాలు నాశనమయ్యాయి. అనేకమంది ఇంకా జైళ్ళలోనే మగ్గుతున్నారు. కాని ఆ తర్వాత ఎన్నార్సీ సిఏఏ గురించి చర్చ అటకెక్కింది. బీజేపీ నేతలు కూడా మాట్లాడడం మానేశారు. అటక నుంచి దించే ప్రయత్నాలు కూడా ఎవ్వరు చేయలేదు. అప్పట్లో బీజేపీ ఐటి సెల్ ఒక ప్రచారం చేసేది. కాగితం చూపించాలి. అంటే ఈ దేశంలో పౌరులుగా నిరూపించుకోడానికి ప్రతి ఒక్కరు కాగితం చూపించాలి. ప్రమాణపత్రాలు చూపించాలి. ఈ ప్రచారం ముఖ్యంగా దేశంలోని ఒక వర్గాన్ని, ఒక సముదాయాన్ని లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ప్రచారంగా కొనసాగిందన్నది రహస్యమేమీ కాదు. ఎందుకంటే, వారికి మాత్రమే సిఏఏలో పౌరసత్వం పొందే అర్హత లేదు. మిగిలిన వారికి సిఏఏ ద్వారా పౌరసత్వం పొందే అర్హత ఉంటుంది. కాగితాలు చూపించలేకపోతే ఎన్నార్సీలో పౌరసత్వం పోతుంది. మిగిలిన వారికి పౌరసత్వం సిఏఏ ద్వారా వచ్చేస్తుంది. కాని ఒక సముదాయానికి మాత్రం దక్కదు. కాబట్టి ఆ సముదాయాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ వేధింపుల ప్రచారం కొనసాగించారు.

ఇప్పుడు ఈ ప్రమాణపత్రాల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. అస్సాంలో ఒక వ్యక్తిని ప్రభుత్వాధికారులు విదేశీయుడిగా ప్రకటించేశారు. బంగ్లాదేశీ చొరబాటుదారుడిగా నిర్ధారించేశారు. చివరకు ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్ళింది. దాదాపు రెండు దశాబ్దాల న్యాయపోరాటం తర్వాత చివరకు సుప్రీంకోర్టు తీర్పు ఏం చెప్పిందంటే - అస్సాంకు చెందిన ఆ వ్యక్తి భారతీయుడేనని ప్రకటించింది. ఎందుకంటే ఆ వ్యక్తి బంధువులందరు భారతీయులే. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ హసనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం ఈ కేసును విచారించింది. గౌహతీ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. విదేశీయుల చట్టం లోని సెక్షన్ 9 ప్రకారం అనుమానస్పదుడైన వ్యక్తి తాను భారతీయుడిగా రుజువు చేసుకోవడం అవసరమే కాని, విచక్షణ

లేకుండా ప్రభుత్వం ఎవరినైనా పట్టుకుని పౌరసత్వం నిరూపించుకోవాలని చెప్పడం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది. అంటే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎవరినైనా అనుమానితుడిగా నిర్ధారించేసి పౌరసత్వం నిరూపించుకోవాలని చెప్పడం కుదరదు. న్యాయస్థానం ఈ విషయంలో స్పష్టంగా చెప్పిందేమిటంటే, న్యాయప్రక్రియ ప్రారంభించడానికి ముందు ఆ వ్యక్తికి వ్యతిరేకంగా సరయిన సాక్ష్యాధారాలుండాలి. అంటే ఒక వ్యక్తిని పట్టుకుని అతను విదేశీయుడని అనుమానించడానికి తగిన సాక్ష్యాధారాలుండాలి. న్యాయస్థానం స్పష్టంగా అధికారుల విచక్షణకు ఈ వ్యవహారాన్ని వదలలేమని చెప్పింది. తగిన సాక్ష్యాధారాలు లేకండా ఎవరిని విదేశీయుడిగా అనుమానించడం కుదరదు. కేవలం పుకార్లు, రూమర్లు, విదేశీయుల చట్టం ప్రకారం ఆధార రహిత ఆరోపణలు, అస్పష్ట ఆరోపణలతో ఎవరినీ అనుమానించడం కుదరదని కూడా కోర్టు చెప్పింది. అంటే ఊళ్ళో ఫలానా వ్యక్తి విదేశీయుడని చెప్పుకుంటున్నారు కాబట్టి, లేకపోతే ఫలానా వ్యక్తి విదేశీయుడని వాట్సప్ ఫార్వార్డ్‌లు నడుస్తున్నాయి. కాబట్టి అతడిని పట్టుకుని పౌరసత్వం రుజువు చేయాలని ఒత్తిడి చేయడం కుదరదు. ఇలాంటి పుకార్లు, ఆధారాలు లేని ఆరోపణలతో ఇష్టమొచ్చినట్లు ఎవరినైనా పట్టుకుని పౌరసత్వం రుజువు చేసుకోవాలని చెప్పడం కుదరదు. న్యాయస్థానం ఇంకా ఏం చెప్పిందంటే, ఏ వ్యక్తినైనా విదేశీయుడిగా అనుమానించి, పౌరసత్వం రుజువు చేసుకోమన్నప్పుడు, అసలు విదేశీయుడిగా ఎందుకు అనుమానిస్తున్నారో చెప్పకపోతే ఆ వ్యక్తి అయోమయానికి గురై ఆందోళనకు లోనవుతాడు. మరో ముఖ్యమైన విషయం కూడా కోర్టు ప్రస్తావించింది. అధికారిక పత్రాల్లో పేర్ల విషయంలో సాధారణంగా తప్పులు జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి తప్పులను పట్టుకుని ఆ వ్యక్తిని వేధించడం కూడా కుదరదని చెప్పింది. క్లుప్తంగా ఏమిటంటే, విదేశీయుడిగా ఎందుకు అనుమానిస్తున్నారో అనుమానితుడికి చెబితే అతను ఆ అనుమానాలను నివృత్తి చేయడానికి న్యాయపోరాటం చేసే వీలుంటుంది. అలాగే ప్రభుత్వ పత్రాల్లో పేరులో స్పెల్లింగ్ తప్పులు, పుట్టిన తేదీలో తప్పులుంటే ప్రభుత్వ యంత్రాంగం అనేక ఇబ్బందులు పెడుతుంటుంది. ఈ విషయంలో కూడా న్యాయస్థానం స్పష్టమైన మాటలు చెప్పింది. ఓటర్ల లిస్టులో పేర్లలో స్పెల్లింగ్ తప్పులు జరగడం చాలా సహజమని, ఓటర్ లిస్టు తయారు చేసే అధికారి ఎవరి డాటా అయినా తప్పుగా ఎంట్రీ చేస్తే, ఆ వ్యక్తి భారత పౌరసత్వం కోల్పోయినట్లు కాదని కోర్టు స్పష్టం చేసింది. విచిత్రమేమిటంటే తప్పులు చేసేది ప్రభుత్వ యంత్రాంగమే, ప్రజలను ఆ తప్పులకు ఇబ్బంది పెట్టేది కూడా ప్రభుత్వ యంత్రాంగమే. నిజానికి తప్పు చేసిన వారికి శిక్ష పడాలి. ఆ తప్పు వల్ల ఇబ్బందికి గురయిన వారికి నష్టపరిహారం లభించాలి. కాని మన దేశంలో ఉల్టా వ్యవహారం. అస్సాంకు చెందిన ఈ వ్యక్తి రెండు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేశాడంటే ఎన్ని కష్టాల పాలయి ఉంటాడో ఊహించండి.

## ఇస్రాయీల్ సైన్యం దుర్మార్గాలు

దక్షిణ గాజాలోని ఒక పాఠశాల భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 30 మంది పాలస్తీనా శరణార్థులు మరణించారు.

ఖాన్ యూనిస్‌కు తూర్పున ఉన్న అబ్బాసాన్ పట్టణంలో అల్-అవదా పాఠశాలపై ఈ దాడి జరిగింది. ఇందులో కనీసం 53 మంది గాయపడ్డారు. బాధితులు దాదాపు అందరు మహిళలు, పిల్లలే ఉన్నారని పాలస్తీనా వైద్యులు తెలిపారు.

పాఠశాల సమీపంలో హమాస్ సైనిక విభాగానికి చెందిన ఉగ్రవాది ఉన్నాడని, అందుకే ఈ దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం చెప్పింది. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, గాజాలోని మూడింట రెండు వంతుల ఐక్యరాజ్యసమితి నడుపుతున్న పాఠశాలలు దెబ్బతిన్నాయి, కొన్ని బాంబు దాడులకు గురయ్యాయి, చాలా తీవ్రంగా ధ్వంసమయ్యాయి" అని పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ అధిపతి ఫిలిప్ లాజారిని అన్నారు.

ఇప్పుడు గాజాలో పాఠశాలలు సురక్షితమైన విద్యార్జన కేంద్రాలు కాదు. శరణార్థులతో కిటకిటలాడే బాంబుదాడులకు గురయ్యే ప్రమాదకరస్థలాలుగా మారాయని ఆయన అన్నారు.

శనివారం నాడు ఇజ్రాయెల్ నుసైరాత్ లోని అల్-జాన్ని పాఠశాలపై దాడి చేసింది. ఈ దాడిలో16 మంది మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆ సమయంలో ఆ పాఠశాల భవనంలో 2,000 మంది శరణార్థులున్నారని ఐక్యరాజ్యసమితి సంస్థ తెలియజేసింది. మరుసటి రోజు, గాజా నగరంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాలపై ఇస్రాయీల్ చేసిన దాడిలో నలుగురు మరణించారు. గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. నుసైరాత్‌లో ఐక్యరాజ్యసమితి నడుపుతున్న మరో పాఠశాలపై దాడి జరిగింది.

అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఇస్రాయీల్ దుర్మార్గంగా అతిక్రమించడం కొత్తకాదని ఐక్యరాజ్యసమితి ప్రతినిధులే చెబుతున్నారు. వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నారు.

ఇజ్రాయెల్ దాడి కాల్పుల విరమణ చర్చలను దెబ్బతీస్తుందని హమాస్ హెచ్చరించింది.

# బహుదైవారాధన... వ్యభిచారం మహా పాపాలు



- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

### బహుదైవారాధన క్షమించరాని పాపమా?

అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారికొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు, ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించాడు అన్నమాట, ఎంతో తీవ్రమైన పాపపుమాట అన్నాడు అన్నమాట. (ఖుర్ఆన్ 4:48)

అల్లాహ్ దృష్టిలో కేవలం షిర్కు ఒక్కటే క్షమార్హం కానిది. అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసినవాడు అపమార్గాన బహుదూరం వెళ్ళిపోయాడు.(4:116)

**పై రెండు ఆయతుల్లో షిర్క్ క్షమించరాని పాపంగా ప్రకటించగా, కింది రెండు వచనాల్లో మాత్రం షిర్క్‌కు క్షమాభిక్ష ప్రకటించ బడింది. ఇది వైరుధ్యం కాదా?**

తరువాత వారు ఆవుదూడను తమ ఆరాధ్య దైవంగా చేసుకు న్నారు. వాస్తవానికి వారు స్పష్టమైన సూచనలు చూసివున్నారు. దానిక్కూడా మేము వారిని మన్నించాము. (4:153)

అల్లాహ్‌ను తప్ప ఏ ఇతర దేవుణ్ణీ వేడుకోనివారు, అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణాన్నీ అన్యాయంగా హతమార్చనివారు, వ్యభిచారానికి పాల్పడనివారు- ఈ పనులను చేసినవాడు ఎవడైనా తన పాపఫలాన్ని పొంది తీరుతాడు. తీర్పుదినంనాడు అతనికి రెట్టింపు శిక్ష పడుతుంది. అందులోనే అతడు శాశ్వతంగా హీన స్థితిలో పడి ఉంటాడు. (ఈ పాపాల తరువాత) పశ్చాత్తాపపడి, విశ్వసించి మంచి పనులు చెయ్యటం ప్రారంభించే వాడు తప్ప. అటువంటి వాడి చెడులను అల్లాహ్ శుభాలుగా మారుస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. పశ్చాత్తాపపడి సద్వర్తనాన్ని అవలంబించే వ్యక్తి అల్లాహ్ వైపునకు మరలివస్తాడు. మరలి రావలసిన రీతిలో (25:68-71)

ఎవరైనా ఒక వ్యక్తి మరణానికి ముందు నిష్కల్మషంగా పశ్చాత్తాప పడితే, అతను బహు దేవతారాధన పాపానికి పాల్పడేవాడైనా అతని పాపాలు క్షమించబడతాయి.

షిర్క్ స్థితిలోనే చనిపోతే మాత్రం అతనికి ముక్తి లభించదు. సూరత్ అల్-నిసా 153లో, అల్లాహ్ తన దాసులు షిర్క్‌ను వదిలేసి నిజంగా పశ్చాత్తాపపడితే అలాంటి వారిని మన్నిస్తాడని అల్లాహ్ శుభవార్త ఇచ్చాడు. అయితే పశ్చాత్తాపం చెందకుండా అవిశ్వాసిగా మరణం సంభవిస్తే, మాత్రం అలాంటి వారికి అల్లాహ్ క్షమాభిక్ష లభించదు. సూరా అల్-ఫుర్కాన్, 68- 69 వచనాలలో, బహు దైవారాధన మహాపాపంగా చెప్పబడింది. ఆ తరువాత వాక్యాలలో మాత్రం స్వచ్ఛమైన పశ్చాత్తాపం (తౌబా) చేసిన వారి పాపాలన్నీ పుణ్యాలుగా లిఖించబడతాయి అని పేర్కొనబడింది. షిర్కుకు పాల్పడి ప్రాయశ్చిత్తం చెందిన వారికి ఇది మంచి శుభవార్త. అవిశ్వాసం, బహుదైవారాధన ఊబి నుండి బయటపడి విశ్వాస

స్థాయికి చేరుకోవడానికి ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది. దానికోసం గొప్ప సంకల్పమే కావాలి. అందుకే దుష్క్రియలన్నిం టనీ శుభాలుగా మార్చేస్తానని శుభవార్తనిచ్చాడు. ప్రతీ ఒక్కరికీ పశ్చాత్తాప ద్వారాలు తెరుచుకునే ఉంటాయి. అందరినీ క్షమించ డానికి అల్లాహ్ సిద్ధంగా ఉన్నాడు. కానీ మృత్యు దూత రాక ముందే పశ్చాత్తపం స్వీకరించబడుతుంది. చావు కళ్ల ముందు వచ్చాక చేసే పశ్చాత్తాపమూ స్వీకరించబడదు.

## వ్యభిచారానికి శిక్ష ఏమిటి? వారిని 100 కొరడా దెబ్బలు కొట్టాలా, చనిపోయే వరకు జైలులో పెట్టి శిక్ష అమలు చేయాలా?

వ్యభిచారిణి, వ్యభిచారి- ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరినీ నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్‌పై, అంతిమదినంపై విశ్వాసం ఉన్నవారే అయితే, వారి మీద కనికరం చూపే తలంపు అల్లాహ్ ప్రసాదించిన ధర్మ (నిర్వహణ) విషయంలో మిమ్మల్ని అడ్డుకోరాదు. వారిని శిక్షించేటప్పుడు విశ్వాసుల వర్గం ఒకటి అక్కడ ఉండాలి. (24:2)

మీ స్త్రీలలో ఎవరైనా సిగ్గుమాలిన పనికి ఒడిగట్టితే, వారికి వ్యతిరేకంగా మీలో నలుగురు మనుషుల సాక్ష్యం తీసుకోండి. నలుగురు మనుషులు గనక సాక్ష్యం ఇస్తే, వారు మరణించే వరకైనా లేదా వారికొరకు అల్లాహ్ ఏదైనా మార్గం చూపించే వరకైనా వారిని ఇళ్ళల్లో నిర్బంధించండి. (4:15)

మీలో ఈ అకృత్యానికి పాల్పడిన వారినిద్దరినీ బాధించండి. తరువాత వారు పశ్చాత్తాపపడి, తమ నడతను సరిదిద్దుకుంటే వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ పశ్చాత్తాపాన్ని అధికంగా అంగీకరి స్తాడు, ఎక్కువగా కనికరిస్తాడు. (4:16)

**పై వాక్యాలలో వ్యభిచారానికి ఒడిగట్టిన వారి శిక్షల ఆదేశాలు న్నాయి. ఈ శిక్షలలో ఏమైనా వైరుధ్యం ఉన్నదా?**

నూర్ 2వ వాక్యంలో వ్యభిచారానికి సంబంధించి చివరి ఆదేశం ఉంది. నిసా సూరాలో 15,16 వాక్యాలలో వ్యభిచార నేరానికి తొలి ఆదేశాలు వివరించబడ్డాయి. షరీఅత్ గ్రంథాలలో ఈ ఆదేశాల ఉత్తర్వులు వివరంగా ఉన్నాయి. ఉపవాసాల ఆదేశాలూ క్రమంగా అవతరించాయి. అదేవిధంగా పరదా ఆదేశాలు మదీనాలో వచ్చాయి. విడతల వారీగా మద్యనిషేధం ఆదేశాలూ వచ్చాయి. ప్రారంభ వాక్యాలలో మద్యం గురించి చెబుతూ లాభం కంటే నష్టమే ఎక్కువని వివరించబడ్డాయి. ఆ తరువాత మత్తులో ఉన్నప్పుడు నమాజు చేయరాదనే ఆదేశాలు వచ్చాయి. ఆ తరువాత మదీనాలో పూర్తిగా నిషేధాజ్ఞలు వెలువడ్డాయి. అదే విధంగా నూర్ అధ్యాయం వాక్యాలలో వ్యభిచారానికి శిక్ష ఆదేశాలు వచ్చాయి. సూరహ్ నిసాలో వ్యభిచారానికి తొలి శిక్షాదేశాలు వచ్చాయి. వ్యభిచారానికి ఇంత కఠిన శిక్షలు ఎందుకు న్నాయంటే, దీన్ని కట్టడి చేయకపోతే సమాజంలో అశ్లీలం, విశృంఖలత్వం వేగంగా వ్యాప్తి చెందుతుంది. పరస్పర అంగీకారంతో జరిగినా వ్యభిచారం శిక్షార్హమైన పాపమే. ఎందుకంటే కుటుంబ వ్యవస్థ నాశనమవు తుంది. మానవ నాగరికత విచ్ఛిన్నమవుతుంది.

గుట్టురట్టు కాకుండా వ్యభిచారానికి పాల్పడితే వ్యక్తులపై నిఘా వేసి పట్టుకోవడం వారిని శిక్షించడం ప్రభుత్వ పని ఎంత మాత్రమూ కాదు. వ్యభిచారం చేసినట్టు ఆరోపణలు చేసి, నలుగురు సాక్షులను అందించకపోతే ఆరోపితులకు 80 కొరడా దెబ్బలు శిక్షపడుతుంది. తప్పుడు ప్రచారం చేసేవారూ శిక్షార్హులే. వ్యభిచారానికి శిక్షాదేశాలతోపాటు పరదా ఆదేశాలు వచ్చాయి. పరదా ఆదేశాలతో వ్యభిచారాన్ని ప్రేరేపించే అన్ని మార్గాలూ మూసి వేయబడతాయి.

## ప్రవక్త నూహ్ (అలై) కొడుకు తుఫానులో కొట్టుకుపోయాడా?

ఈ కానుకనే మేము నూహ్‌కు ప్రసాదించాము. వీరందరికంటే ముందు అతను మమ్మల్ని వేడుకున్నప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. మేము అతని ప్రార్థనను అంగీకరించాము. అతనికీ, అతని కుటుంబానికీ తీవ్రమైన వ్యధ నుండి విముక్తి కలిగిం చాము. (21:76)

అతడు తిరిగి సమాధానం పలికాడు: ‘‘నేను ఇప్పుడే ఒక కొండపైకి ఎక్కుతాను. అది నన్ను నీళ్ళనుండి కాపాడుతుంది.’’ నూహ్ ఇలా అన్నాడు : ‘‘అల్లాహ్ తీర్పు నుండి ఈనాడు రక్షించే వస్తువు

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఏదీ లేదు, అల్లాహ్‌యే ఎవరినైనా కరుణిస్తే తప్ప.'' ఇంతలోనే ఒక కెరటం వారిద్దరికీ మధ్య అడ్డుగా వచ్చింది. అతడు కూడా మునిగిపోయే వారిలో కలసిపోయాడు. (11:43)

నూహ్ కుటుంబాన్ని రక్షించాడని ఒకచోట, నూహ్ కుమారుడు నీట మునిగి చనిపోయాడని మరోచోట చెప్పబడింది ఖుర్‌ఆన్‌లో. సొంత కుమారుడు ఇంటివాడు కాడా?

అంబియా సూరాలో నూహ్ కుటుంబాన్ని రక్షించాము అని ఉన్నది. సూరె హూద్‌లో మాత్రం నూహ్ అలైహిస్సలామ్ అల్లాహ్‌తో 'నా కొడుకు నా కుటుంబంలోని వాడే కదా? వాడు రక్షించబడ తాడా?' అని అడిగినప్పుడు అతను అల్లాహ్ వాగ్దానాన్ని నెరవేర్చని వాడనే జవాబు వచ్చింది. అల్లాహ్ వాగ్దానాలు విశ్వాస షరతులకు లోబడి ఉంటాయి. ప్రవక్త కుమారులకూ ఇదే వర్తిస్తుంది. నూహ్ (అలై) ఇతర బిడ్డలు రక్షించబడ్డారు. నూహ్ భార్య కూడా రక్షింప బడలేదు. సూరె తహ్రీమ్ 10వ వాక్యంలో ఇదే విషయం చెప్పబడింది. ఆమె నరకానికి వెళ్లే వారిలో చేరిందని చెప్పబడింది. ప్రవక్త కొడుకు, భార్య అయినప్పటికీ వారు అవిధేయులైతే అల్లాహ్ శిక్షనుండి తప్పించుకోలేరు.

## ఫిరౌన్ సముద్రంలో మునిగిపోయాడా?

ఇప్పుడు మేము కేవలం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము, నీవు వచ్చే తరాల వారికి గుణపాఠం గుర్తుగా ఉండేటందుకు. కాని చాలామంది మానవులు మా సూచనలను నిర్లక్ష్యం చేస్తారు.'' (ఖుర్‌ఆన్ 10:92)

చివరకు మేము అతనినీ అతని సైన్యాలనూ పట్టుకుని సముద్రం లోకి విసరివేశాము. చూడు ఆ దుర్మార్గులకు ఏ గతి పట్టిందో. (28:40)

చివరకు ఫిరౌను మూసానూ, ఇస్రాయీలు సంతతినీ భూమిపై లేకుండా చేయాలని సంకల్పించుకున్నాడు. కాని మేము అతడినీ, అతడి సహచరులనూ మూకుమ్మడిగా ముంచివేశాము. (17:103)

చివరకు వారు మాకు ఆగ్రహం కలిగించినప్పుడు, మేము వారికి ప్రతీకారం చేశాము. వారందరినీ కలిపి ముంచివేశాము. (43:55)

ఒక చోట ఫిరౌన్‌ను, మరోచోట ఫిరౌన్ సైన్యమునూ సముద్రంలో ముంచివేశాము అన్న వాక్యాలలో వైరుధ్యం లేదా?

ఈ వాక్యాలలో ఫిరౌన్ నీట ముంచేశామని, సూరా యూనుస్ 92వ వచనంలో మాత్రం, ''నీ శరీరాన్ని రక్షించడం ద్వారా, మేము దానిని ఒక గుణపాఠంగా చేస్తాము.'' అని చెప్పబడింది. ఈ వాక్యాలలో రాబోవు తరాలకు ఒక గుణపాఠంగా చూపేందుకు ఫిరౌన్ మృతదేహాన్ని రక్షించడమే ప్రధాన ఉద్దేశం.

రెండున్నర వేల సంవత్సరాలు దాటినప్పటికీ ఫిరౌన్ మృత కళేబరం భద్రంగా ఉంది. ఫిరౌన్ కళేబరం 1898లో కనుగొనబడింది. కైరో మ్యూజియంలోని రాయల్ మమ్మీస్ గదిలో ఉంచబడింది. ఖుర్‌ఆన్ దైవ వాక్యమనడానికి ఈ వాక్యమే నిదర్శనం.

## క్రైస్తవులు స్వర్గానికి వెళ్తారా లేదా నరకానికా?

అరేబియా ప్రవక్త (ముహమ్మద్)ను విశ్వసించేవారు కానీ, యూదులు కానీ, క్రైస్తవులుకానీ, సాబియీలుకానీ - ఎవరైనాసరే- అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించి మంచి పనులు చేసినవారికి నిస్సందేహంగా వారి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం ఉంది. వారికి ఏ విధమైన భయంకానీ, విచారంకానీ కలిగే అవకాశం లేదు. (2:62)

మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్ అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ ఇలా అన్నాడు : ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఆయన నాకూ ప్రభువే మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు. (5:72)

''ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్) కాక మరొక విధానాన్ని అవలంబించదలిస్తే, ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు''. (3:85)

యూదులు, క్రైస్తవులు, సబియన్లు, ముస్లింలు అందరూ రక్షింప బడతారని సూరా అల్-బఖరా 62వ వచనంలో చెప్పబడింది. ఇతర వాక్యాలలో మాత్రం, బహుదేవతారాధన వల్ల క్రైస్తవులు నరకానికి వెళతారని చెప్పబడింది. ఇది వైరుధ్యం కాదా?



జవాబు : ఈ మూడు వాక్యాలలో ఎలాంటి వైరుధ్యాలు, భేదాలు లేవు. సూరా బఖర అధ్యాయం 2లో మోక్షమార్గానికి విశ్వాసం, ధర్మబద్ధమైన మంచి పనులు రెండూ అనివార్యమని చెప్ప బడ్డాయి. అల్లాహ్ పట్ల, పరలోకం పట్ల విశ్వాసమే దీనికి షరతు. అల్లాహ్ పట్ల విశ్వాసం అంటే షిర్కు నుండి పవిత్రంగా ఉండాలి. ప్రవక్త ఈసా (అలై)ను దేవుడిగా భావించడం, దేవుని కుమారుడిగా విశ్వసించడం అంటే అల్లాహ్‌కు భాగస్వాములుగా చేర్చడమే అవుతుంది. ఈమాన్ బిల్లాహ్ (అల్లాహ్ పట్ల విశ్వాసానికి పూర్తిగా విరుద్ధం). అదే విధంగా, ఎవరైతే యేసుకు సంబంధించిన త్రిత్వ సిద్ధాంతాన్ని నమ్ముతారో, శిలువ మరణాన్ని మోక్షానికి సాధనంగా భావిస్తారో అలాంటి విశ్వాసం పరలోకం పట్ల విశ్వాసానికి తీవ్ర విరుద్ధమైనది. విశ్వాసం తరువాత రెండో ముఖ్యమైన షరతు ధర్మబద్ధమైన సత్కర్మలు. మంచి పనులు సత్క్రియలు ఎప్పుడవుతాయి? ఈ మంచి పనులకు విశ్వాసం ప్రేరణ కాకపోతే అవి సత్కర్మలు కావు.

క్రైస్తవులు, యూదులు, సబియన్లను విశ్వసించాలని అల్లాహ్ పిలుపునిస్తున్నాడు ఈ వాక్యాలలో. అన్ని కాలాలలోనూ సర్వసృష్టికర్త తన ప్రవక్తల ద్వారా అందించిన ఏకైక ధర్మం ఇస్లామ్.

## ముస్లిమేతరుల మంచి పనులకు అల్లాహ్ ప్రతిఫలమిస్తాడా?

ముష్రిక్కులు అల్లాహ్ మసీదులలో సంరక్షకులుగా, సేవకులుగా ఉండటానికి పనికిరారు. ఎందుకంటే వారే స్వయంగా అవిశ్వాసు లమని తమకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తున్నారు. వారి కర్మలైతే అన్నీ వ్యర్థమైపోయాయి. నరకంలో వారు కలకాలం ఉండాలి. (9:17)

ఆ తరువాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుం టాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసివున్నాసరే దాన్నీ అతను చూసుకుంటాడు. (99:7)

పై రెండు ఖుర్‌ఆన్ వాక్యాలలో ఎలాంటి వైరుధ్యమూ లేదు. షిర్క్ చేసేవారు మసీదుల సేవకూ ఆమోదయోగ్యులు కారని, అలాంటి వారి సేవలు ఆమోదయోగ్యం కావని పైఖుర్‌ఆన్ వాక్యం స్పష్టం చేస్తుంది. బహుదైవారాధన భావన మంచి పనులనూ వృథా పరుస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి దేశానికి వ్యతిరేకంగా దేశద్రోహానికి పాల్పడినట్లయితే, ఆ సందర్భంలో, అతని సేవలు కూడా ఆమోదయోగ్యంగా పరిగణించబడవు. మనిషి చేసుకున్న ప్రతీ చిన్న సత్కార్యమైనా, అతి చిన్న చెడ్డ పనైనా లెక్కించడం జరుగుతుంది. ఒకవేళ మనిషి విశ్వాసి అయినట్లయితే అలాంటి వారి చిన్న చిన్న పాపాలను అల్లాహ్ మన్నిస్తాడు. ఒకవేళ దైవ తిరస్కారి, బహుదైవారాధకుడయి ఉంటే అలాంటి వ్యక్తి మంచి పనులకు పరలోకంలో ఎలాంటి ప్రతిఫలమూ దక్కదు. ఈ మంచి పనులకు ఈ లోకంలో ఏదైనా ప్రతిఫలం లభిస్తుందేమోకానీ పరలోకంలో మాత్రం ఎలాంటి వాటా దక్కదు.

## నరకంలో లభించే ఆహార పదార్థాలేమిటి?

వారి కొరకు ఎండిన ముళ్ల గడ్డి తప్ప మరొక ఆహారం ఉండదు. (88:6)

అది నరకం అడుగు భాగం నుండి మొలిచే ఒక చెట్టు. దాని మొగ్గలు షైతానుల తలలు మాదిరిగా ఉంటాయి. నరకవాసులు వాటిని తింటారు. వాటితోనే కడుపు నింపుకుంటారు. (37:74-77)

గాయాల కడుగు తప్ప అతనికి తినటానికి ఆహారం కూడ ఏదీ ఉండదు. దానిని పాపాత్ములు తప్ప మరెవరూ తినరు. (69:36-37)

నరకవాసుల ఆహార పదార్థాల మెనూలో ఒక చోట ఎండిన ముళ్ల గడ్డి అని, మరోచోట గాయాల కడుగు అని ఉంది. ఈ వాక్యాలలో వైరుధ్యం ఉంది కదా?

జవాబు : నరకవాసులకు ఎండిన ముళ్ల గడ్డిలా ఉండే జఖ్ఖూమ్ చెట్టు ఆకులు ఇస్తారు. ఈ చెట్టు నరకం అట్టడుగు నుండి మొలకెత్తుతుంది. ఆహారాన్ని పానీయాల నుండి వేరు చేస్తే తినడానికి జఖ్ఖూమ్ చెట్టు ముళ్ల గడ్డి ఇవ్వబడుతుంది.

త్రాగడానికి మాత్రం పానీయంగా గాయాల కడుగు ఇవ్వబడు తుంది. నరకవాసులకు దాహం వేసినప్పుడు సలసలకాగే వేడి నీరు అందించబడుతుంది అని ఖుర్‌ఆన్‌లో పలు చోట్ల చెప్పబడింది. ఖుర్‌ఆన్‌లోని ఒక మాట మరో మాట పూర్తిచేస్తుంది. ఖుర్‌ఆన్‌లోని వాక్యాలు Contradictory కావు పరస్పరం Complimentaryగా సాగుతాయి. ఖుర్‌ఆన్‌లోని ఒక వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి అదే అంశంతో కూడిన మరో వాక్యం ఎంతగానో దోహదపడతుంది. ఖుర్‌ఆన్ ద్వారా మార్గదర్శకం పొందాలనుకునేవారికి మాత్రమే ఈ పద్ధతి ఉపయుక్తమవుతుంది. ఏ సంకల్పంతోనైతే ఖుర్‌ఆన్ చదువుతారో ఆ సంకల్పం తప్పక నెరవేరుతుంది. మన సంకల్పానికి తగ్గట్టుగానే అల్లాహ్ మార్గనిర్దేశనం చేస్తాడు.




## మోదీ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

జమ్ముకాశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కి మరిన్ని అధికారాలను కట్టబెట్టిన మోడీ సంకీర్ణ ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ.. అలా చేయకుండా కేంద్రపాలిత ప్రాంతం (యుటి) జమ్ముకాశ్మీర్‌కు బిజెపి ద్రోహం చేస్తున్నదని విమర్శిం చింది. ఎల్‌జికి మరిన్ని అధికారాలను అప్పగించాలనే బిజెపి సంకీర్ణ ప్రభుత్వ నిర్ణయాన్ని 'సంవిధాన్ హత్యా దివస్'గా అభివర్ణించింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. "మార్పులు రెండు అర్థాలను సూచిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణను ఆలస్యం చేయాలనుకుంటున్నది. లేదా రాష్ట్ర హోదా పునరుద్ధ రించబడినప్పటికీ.. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని అణచి వేయటం ద్వారా ఎల్‌జి దయ ప్రకారం నడుచుకునేలా చేయాలనుకుంటుంది" అని అన్నారు.

## ఆ విషయంలో కేంద్రం యూటర్న్

ఢిల్లీ యూనివర్శిటీలో న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలనే ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్రం యూటర్న్ తీసుకుంది. న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలనే ప్రతిపాదనను ఢిల్లీ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ తిరస్కరించారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హైదరాబాద్‌లో జరిగిన ఒక పత్రికా సమావేశంలో వెల్లడించారు. లా కోర్సులో మనుస్మృతిను చేర్చే ప్రసక్తే లేదని చెప్పారు. ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించే ప్రతిపాదనను తిరస్కరించారని పేర్కొన్న ప్రధాన్, రాజ్యాంగం యొక్క నిజమైన స్ఫూర్తిని నిలబెట్టడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మొదటి, తృతీయ సంవత్సరాల విద్యార్థులకు మనుస్మృతిని బోధించడానికి సమావేశంలో ప్రతిపాదించారు. కాగా, మరోవైపు ఈ ప్రతిపాదనను విరమించికున్నట్లు ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

## కొల్హాపూర్‌లో దారుణం

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కొందరు కాషాయ గూండాలు మసీదుపై పథకం ప్రకారం దాడి చేశారు. మసీదులోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. ఖురాన్, ఇతర మతపరమైన పుస్తకాలను అపవిత్రం చేసి, వాటిని తగులబెట్టారు. అంతే కాదు, కొందరు పోకిరీలు మసీదు పైకప్పుపైకి ఎక్కి మసీదు నిర్మాణాన్ని పగలగొట్టడానికి ప్రయత్నించారు. మసీదుపై కాషాయ జెండాను ఎగురవేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మస్జిద్‌లో విధ్వంసం సృష్టించిన తరువాత చుట్టుపక్కల ముస్లిముల ఇళ్ళను గుర్తించి మరీ దాడులు చేశారు. ఇంటి బయట పార్క్ చేసిన వాహనాలను ధ్వంసం చేసి ఇళ్ల కిటికీలపైకి రాళ్లు రువ్వి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ దోపిడిలకు పాల్పడారు. అనంతరం విజయం సాధించామన్న గర్వంతో సంబరాలు చేసుకున్నారు. ఈ క్రూర ఘటనను కొందరు ఉగ్ర చర్యగా పేర్కొంటున్నారు.

## పద్నాలుగు వందల రోజులుగా జైలులోనే...



జెఎన్‌యులో పిహెచ్‌డి చేసిన ఉమర్ ఖాలిద్ ఎలాంటి విచారణ లేకుండా 1400 రోజులుగా జైలులో మగ్గుతున్నారు. ఆయనకు న్యాయం సుదూర స్వప్నంగానే మిగిలిపోయింది. 2020 సెప్టెంబరులో ఢిల్లీలో అల్లర్లు రెచ్చగొట్టారని ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు ఖాలిద్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుండి తీహార్ జైల్లో ఉమర్ ఖాలిద్ ఉన్నారు. సిఎఎ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు కారణంగానే ఈ అల్లర్లు చోటుచేసుకున్నాయని ఢిల్లీ పోలీసులు ఆరోపిస్తున్నారు. ఖాలిద్‌తో పాటు సిఎఎ ఆందోళనల్లో పాల్గొన్న షర్జీల్ ఇమామ్‌తో పాటు మొత్తంగా 20 మందిని ఈ అల్లర్ల కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ 20 మందిలో అరెస్టయిన వారిలో ఖాలిదే చివరి వ్యక్తి. ఉమర్ ఖాలిద్‌పై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. వీటిలో ఒకదాన్ని ఎత్తివేశారు. మరొక కేసులో ఇప్పటి వరకూ ఖాలిద్‌కు వ్యతిరేకంగా ఛార్జీషీట్ దాఖలు చేయలేదు. మరోవైపు దిగువ కోర్టుల నుంచి అత్యున్నత న్యాయస్థానాల వరకూ ఖాలిద్‌కు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ వస్తున్నాయి. ఎలాంటి విచారణ లేకుండా ఏళ్ల తరబడి ఖాలిద్‌ను జైల్లో ఉంచడంపై ఆయన భార్య ఆందోళన వ్యక్తం చేశారు. 'మాకు కనుచూపు మేర న్యాయం కనిపించడం లేదు. చాలా కష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం' అని అన్నారు.

## నేపాల్ నూతన ప్రధానిగా ఓలి



నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగోసారి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లోని శీతల్ నివాస్‌లో అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఓలి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఓలి ప్రమాణ స్వీకారం అనంతరం 30 రోజులలోపు పార్లమెంటులో తన బలాన్ని నిరూపించాల్సి వుంది. 275 సీట్లు కలిగిన పార్లమెంట్ ప్రతినిధుల సభలో ఓలి విశ్వాస పరీక్షలో నెగ్గాలంటే కనీసం 138 ఓట్లు కావాల్సి వుంది. ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షల్లో ఓడిపోయిన ప్రచండ స్థానంలో ఓలి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ సుస్థిరత నెలకొల్పడమే కొత్త సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా వుంది.

## గాజా సేఫ్ జోన్ పై దాడి

గాజా దక్షిణ ప్రాంతంలోని సేఫ్ జోన్ పై ఇస్రాయీల్ బలగాలు జరిపిన దాడుల్లో 71మంది చనిపోగా, వందల సంఖ్యలో గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. హమాస్ మిలటరీ విభాగ అధిపతిని లక్ష్యంగా చేసుకునే ఈ దాడులు జరిగాయంటూ ఇస్రాయీల్ అధికారి ఒకరు తెలిపారు. అయితే తాజాగా జరిపిన దాడుల్లో 289మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. చనిపోయిన వారిని, గాయపడిన వారిని సమీపంలోని నాసర్ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ఉత్తర రఫా నుంచి ఖాన్ యూనిస్ వరకు మానవతా జోన్‌గా ఇజ్రాయిల్ ప్రకటించిన ప్రాంతం మువసి లోనే ఈ దాడి జరిగింది.

## రాయల్ వీటోను ఉపయోగించనున్న మాక్రాన్

గత వారాంతంలో ఫ్రాన్స్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా సీట్లు గెలిచిన వామపక్ష కూటమి నుండి ప్రధానిని నియమించేందుకు తిరస్కరించిన తర్వాత అధ్యక్షుడు మాక్రాన్ రాయల్ వీటోను ఉపయోగిస్తున్నారని వామపక్ష పార్టీలు విమర్శించాయి. అత్యధికంగా సీట్లు గెలిచిన కూటమికి అధికారం ఇవ్వకుండా తన అధికారాలతో అడ్డుకోవడమే ఈ రాయల్ వీటో. మాక్రాన్ తీరుపై సోషలిస్టు పార్టీ చీఫ్ ఆలీవర్ ఫార్ స్పందిస్తూ, ఫ్రెంచి ప్రజల తీర్పును, ఓటును గౌరవించడంలో అధ్యక్షుడు విఫలమయ్యారని విమర్శించారు. మరో రాడికల్ నేత జేన్‌లూస్ మెలెంకన్ మాట్లాడుతూ మాక్రాన్‌పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాయల్ వీటో తిరిగి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2022 ఎన్నికల్లో మాక్రాన్ కూటమి 174సీట్లు గెలిచినా అధికార పగ్గాలు చేపట్టిన మాక్రాన్ ఇప్పుడు ఎన్‌పిఎఫ్ 193సీట్లు గెలిచినా దాన్ని ఆమోదించడానికి తిరస్కరిస్తున్నారని విమర్శించారు.

## ఇమ్రాన్ ఖాన్ పార్టీపై పాకిస్తాన్ ప్రభుత్వం నిషేధం!

దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదన్న ఆరోపణలపై మాజీ ప్రధాని ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్(పీటీఐ)పై నిషేధం విధించనున్నట్టు పాకిస్థాన్ ప్రభుత్వం వెల్లడించింది. విదేశీ నిధుల కేసు, మే 9 నాటి అల్లర్లు తదితర అంశాలు పీటీఐ నిషేధానికి సాక్ష్యాలుగా పనికి వస్తాయని పేర్కొంది.

## శిథిలాల తొలగింపుకు 15 ఏళ్ళు పట్టవచ్చు



గాజాలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనాల శిథిలాలను తొలగించడానికి కనీసం 15 సంవత్సరాలు పడుతుందని ఐక్యరాజ్యసమితి సంస్థ తెలిపింది. ఐక్యరాజ్యసమితికి చెందిన సంస్థ రిలీఫ్ అండ్ వర్క్స్ ఫర్ పాలస్తీనా రెఫ్యూజీస్ (UNRWA) ఈ వివరాలను విడుదల చేసింది. ఆ ప్రాంతాన్ని మళ్లీ నివాసయోగ్యంగా మార్చాలంటే 4 కోట్ల టన్నుల భవన శిథిలాలను తొలగించాలని పేర్కొంది. 100 ట్రక్కులతో 15 సంవత్సరాలు పని చేస్తే భవన శిథిలాలను తొలగించవచ్చని తెలిపింది. దీనికి 50 కోట్ల డాలర్లు (రూ.417 కోట్లు) ఖర్చవుతుందని యుఎన్ ఆర్‌డబ్ల్యూఏ పేర్కొంది.

# అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే సత్కార్యాలన్నీ వృధా అవుతాయి

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**అల్లాహ్** ఒక్కడే అన్ని ఆరాధనలకు అర్హుడు. ఆయన తప్ప వేరే ఎవరూ, ఎటువంటి ఆరాధనకూ అర్హులు కారు. కాజాలరు. ప్రళయదినాన మానవుల విముక్తి రెండే రెండు విషయాలపై ఆధారపడి ఉంటుంది. అవి 1) సత్య విశ్వాసం 2) సత్కార్యాలు. సత్య విశ్వాసం అంటే అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉండటం. అంతేగాక ప్రవక్త ముహమ్మద్(స) యొక్క సందేశం నందు, అంతిమ దినం నందు, దైవదూతలు, దైవగ్రంథాల యందు, విధివ్రాత యందు సత్య విశ్వాసం కలిగి ఉండటం. ఈ సత్య విశ్వాసానికి మూలాధారం ఏక దైవారాధన. అలాగే దైవప్రవక్త ముహమ్మద్ (స) సదాచారణలకు అనుగుణంగా చేయబడే కార్యాలు సత్కార్యాలనబడతాయి. పరలోకంలో విముక్తికై సత్కార్యాలు తప్పనిసరి. కాని ఏకదైవోపాసన లేకపోతే పరలోక విముక్తి అసలు లభించదు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నీవు అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే నీ సత్కార్యాలన్నీ వృధా అవుతాయి. నీవు సర్వనాశనం అవుతావు." (అజ్ జుమర్ 39: 65)

"మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను. నా దాస్యం పట్ల అహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించడం తథ్యం".

(అల్ మూమిన్ 40: 60)

అల్లాహ్ యొక్క సమస్త దాసులు సజ్జనులైనా, దుర్జనులైనా, పుణ్యాత్ములైనా పాపాత్ములైనా, జ్ఞానులైనా అజ్ఞానులైనా, గురువులైనా, శిష్యులైనా, ధనికులైనా పేదలైనా, పురుషులైనా స్త్రీలైనా, ఎవరైనా సరే, ఎక్కడైనా సరే అల్లాహ్‌నే ప్రార్థించాలి. ఆయనకు మధ్యవర్తిత్వం అక్కరలేదు. అల్లాహ్ స్వయంగా సూటిగా అందరి విన్నపాలు, ప్రార్థనలు ఆలకించి, మారు పలికి, స్వీకరించి, కష్ట విమోచన కలిగించి అవసరాలు తీరుస్తాడు. ప్రభువైన అల్లాహ్ భక్తులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాడు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "ఓ ప్రవక్తా! నా దాసులు నా గురించి నిన్ను ప్రశ్నిస్తే, నా ప్రకటన వారికి వినిపించు. నేనే అతి సమీపంగా ఉన్నాను. ఎవరైనా సరే, ఎప్పుడైనా సరే నన్ను ప్రార్థించి పిలువగానే నేనే వెంటనే ఆలకించి మారు పలుకుతాను." (అల్ బఖర 2: 186)

అల్లాహ్ తన సర్వదాసులకు అతి సమీపంగా ఉన్నాడు. అనగా ఆయన అత్యంత జ్ఞానవంతుడు. శక్తివంతుడు కాబట్టి సర్వదాసుల సర్వస్థితులు ఆయనకు తెలుసు. కావున ప్రతి వ్యక్తి సూటిగా తన ప్రియ దేవుడైన అల్లాహ్‌ను ప్రార్థించవచ్చు. పిలువ వచ్చు. దుఃఖ బాధలు చెప్పుకోవచ్చు. స్థితిగతులు వినిపించవచ్చు. ఎందుకంటే అల్లాహ్ ప్రతి వ్యక్తికీ, అతని జీవనాళం కంటే ఎక్కువ సమీపంగా ఉన్నాడు.

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈవిధంగా సెలవిచ్చాడు :

"అతి నిశ్చయంగా నా ప్రభువైన అల్లాహ్ అతి సమీపాన ఉన్నాడు. అంతేగాక ప్రార్థించి పిలిచేవారి పలుకులు విని, ఆలకించి వెంటనే మారు పలుకును." (హూద్ 11: 61)

అల్లాహ్ తన దాసుల ప్రార్థనలు స్వయంగా ఆలకించి మారు పలుకును. దానికై మధ్యవర్తులు, సిఫారసుల అవసరం లేదు. ఇక ఆలోచించవలసినదేమిటంటే ఒక పరిపాలకుడు ప్రజల విన్నపాలు స్వయంగా వినటం కోసం రేయింబవళ్ళు వేచి ఉన్నప్పుడు ఆయన సమక్షంలో సూటిగా విన్నవించుకోకుండా ఇటుఅటు తిరుగుతూ మధ్యవర్తిత్వాలను వెతకటం అజ్ఞానం, మూర్ఖత్వం.

అల్లాహ్ గుణ విశేషాలు అతి సంపూర్ణమైనవి. ఆయన ఏడు లోకాల క్రింది నుండి మొరపెట్టుకునే చిన్న చీమ పిలుపు కూడా వినగలడు. దాని పరిస్థితుల జ్ఞానం ఆయనకు ఉంటుంది. అంతేగాక కోట్లాది మైళ్ళ దూరాన తన స్థానంలోనే ఉండి ఎటువంటి మధ్యవర్తుల, సహకారుల అవసరం లేకుండానే దీనుల మొరలు విని విమోచన ప్రసాదించగలడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**